

అడ్డదారి గురువులపై సస్పెన్షన్ వేటు!

- తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివిస్తూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు

అనకాపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం మండలానికి చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది. కేబీపాలెం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు కె.సంధ్య, నగరం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు జి.సూర్యప్రకాశ్ తమ పిల్లల పేర్లను ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు ... మిగతా 6వ పేజీలో

సమస్యల పరిష్కారమే అజెండా..

'ఆంధ్రజ్యోతి' మహత్తర కార్యక్రమం



అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

- ప్రజల వద్దకు ప్రజా ప్రతినిధులు, అధికారులు
- అనకాపల్లిలో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం
- స్థానికులకు సమస్యలు నేరుగా చెప్పుకునే అవకాశం
- అక్కడికక్కడే అధికారుల వివరణలు
- పెద్ద సంఖ్యలో హాజరైన కోట్నీ వీధి, లక్ష్మీనారాయణనగర్ వాసులు
- డ్రైనేజీలు, వీధి లైట్లు, తాగునీరు, దోమల బెడద, వీధికుక్కల సమస్యలు ప్రస్తావన
- వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, జీవీఎంసీ అధికారులు హామీ
- 'ఆంధ్రజ్యోతి' చొరవకు స్థానికుల ప్రశంసలు



కార్యక్రమానికి హాజరైన కోట్నీ వీధి, లక్ష్మీనారాయణనగర్ వాసులు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి. వేదికపై టీడీపీ నేత నీలబాబు, జీవీఎంసీ డీఈఈ గోపాలకృష్ణ, పట్టణ సీఐ విజయ్‌కుమార్, మెప్మా ఏపీడీ సంతోశ్‌కుమార్, జీవీఎంసీ వాటర్ వర్క్స్ ఏఈ హరీశ్



మాట్లాడుతున్న జీవీఎంసీ డీఈఈ గోపాలకృష్ణ

(అనకాపల్లి - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అనకాపల్లి పట్టణంలోని కోట్నీ వీధి, లక్ష్మీనారాయణనగర్‌లో సామాజిక సమస్యలపై స్థానికులు గొంతెత్తారు. మంగళవారం జీవీఎంసీ 84వ వార్డు పరిధిలోని కోట్నీవీధి రామాలయం కల్యాణ మండపంలో 'అక్షరం అండగా... సమస్యల పరిష్కారమే అజెండాగా' పేరుతో 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన వినూత్న కార్యక్రమానికి స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, టీడీపీ నాయకుడు మాధవశెట్టి నీలబాబు, జీవీఎంసీ అనకాపల్లి జోన్ డీఈఈ గోపాలకృష్ణ, పట్టణ సీఐ విజయకుమార్, మెప్మా ఏపీడీ సంతోష్‌కుమార్, జీవీఎంసీ వాటర్‌వర్క్స్ ఏఈ హరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. మురుగునీటి కాలువలు, తాగునీటి సరఫరా, రహదారులు, వీధి లైట్లు, పారిశుధ్యలోపం, తదితర సమస్యలను స్థానికులు ప్రస్తావించగా, వీలైనంత త్వరగా పరిష్కరిష్కరిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధి హామీ ఇచ్చారు.

లక్ష్మీనారాయణనగర్, మరిడిమాంబ గుడి, కోట్నీవీధి ప్రాంతాలకు చెందిన శంషుద్దీన్, వెంకటరత్నం, లక్ష్మీప్రసాద్, కోట్నీ యశోద, మరికొందరు మాట్లాడుతూ పారిశుధ్యం లోపించిందని, డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోయి దోమల బెడద ఎక్కువైందని, కాలువల నుంచి భరించలేని దుర్గంధం వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రెండు, మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ నడిచేందుకు వీలులేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కార్పొరేటర్ చినతల్లి స్పందిస్తూ.. ఈ ప్రాంతంలో డ్రైనేజీ కాలువలకు మరమ్మతులతోపాటు రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి కోట్నీ వీధి వరకు ... మిగతా 6వ పేజీలో

రోడ్లపై మురుగు నీరు



కోట్నీ వీధి గాంధీ విగ్రహం నుంచి మరిడిమాంబ గుడి వరకు డ్రైనేజీ కాలువ శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగునీరు రోడ్డుపైనే పారుతున్నది. దీంతో తీవ్ర దుర్వాసన వస్తున్నది. కాలువ పునర్నిర్మాణంతోపాటు రోడ్డు ఎత్తు పెంచాల్సి ఉంది. ఈ ప్రాంతంలో రీడింగ్ రూమ్ లేదా గ్రంథాలయం నిర్మించాలి. గతంలో మంజూరైన ఓపెన్ జిమ్ నిర్మాణం ప్రారంభమయ్యేలా చూడాలి. -తలారి లక్ష్మీప్రసాద్, న్యాయవాది

గంటల వ్యవధిలోనే స్పందన

- కోట్నీ వీధి ప్రాంతంలో దోమల నివారణకు చర్యలు ప్రారంభం
- డ్రైనేజీ కాలువల్లో పూడికతీత



రామాలయం వీధిలో దోమల నివారణ మందును ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

అనకాపల్లి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 84 వార్డు పరిధి కోట్నీవీధి, లక్ష్మీ నారాయణనగర్‌లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జీవీఎంసీ అధికారులు చర్యలు ప్రారంభించారు. కోట్నీ వీధి రామాలయం కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన చర్చా వేదికలో స్థానికులు పలు సమస్యలను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కోట్నీవీధి, రామాలయం వీధి, మరిడిమాంబ ఆలయ ప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉందని, కోట్నీవీధిలో డ్రైనేజీ కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తున్నదని చెప్పారు. అనంతరం గంటల వ్యవధిలోనే ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ ఆర్.రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఆయా వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. ఈ పనులను నిరంతరం కొనసాగిస్తామని రవికుమార్ తెలిపారు. కుక్కల బెడదను నివారించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



కోట్నీవీధిలో కాలువను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

35 వేల కిలోల గంజాయి దహనం

ఫార్మాసిటీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులో శాస్త్రీయ పద్ధతిలో కాల్చివేత

- ప్రారంభించిన డీజీపీ ద్వారకా తిరుమలరావు





పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు. చిత్రంలో ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఐజీ ఆకే రవికృష్ణ, రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా ఉన్నారు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

పరవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో గత రెండు సంవత్సరాల్లో పట్టుబడిన 35 వేల కిలోల గంజాయి, 39.4 లీటర్ల హ్యాష్ ఆయిల్ (ద్రవ గంజాయి)ను మంగళవారం స్థానిక ఫార్మాసిటీలోని రాంకీ కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులో డ్రగ్ డిస్పోజల్ కమిటీ పర్యవేక్షణలో దహన ప్రక్రియను ప్రారంభించారు. అంతకుముందు రాష్ట్ర డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు ఇక్కడకు వచ్చి గంజాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా ... మిగతా 6వ పేజీలో

మార్కెట్ కమిటీలు.. ఉత్సవ విగ్రహాలు

సిబ్బంది కొరత, పెరగని ఆదాయం

- చోడవరం, మాడుగుల కమిటీలకు ఒక్కరే కార్యదర్శి



చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం



మాడుగులలో అద్దె భవనంలో నడుస్తున్న మార్కెట్ కమిటీ కార్యాలయం

చోడవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ప్రధానమైన చోడవరం, మాడుగుల వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి. ఒక పక్క సిబ్బంది కొరత, మరోపక్క తగ్గిపోతున్న ఆదాయంతో వ్యవసాయ మార్కెట్ కమిటీలు నిర్వీర్యమవుతున్నాయి.

చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు గతంలో చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఒక్కటే ఉండేది. దీంతో ఆదాయం కూడా బాగానే ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక మార్కెట్ కమిటీ ఉండాలని నిర్ణయం తీసుకోవడంతో మాడుగుల నియోజకవర్గానికి కొత్తగా మార్కెట్ కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి సొంత గూడు కల్పించకపోవడంతో అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. సొంత భవనం నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించినట్టు నాటి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ .. నిధులు విడుదల చేయకపోవడంతో భవన నిర్మాణం జరగలేదు. ఇక చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కూడా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ వచ్చే ఆ దిశగా మార్కెట్ యార్డులో కార్యకలాపాలు లేకపోవడంతో నిర్జీవంగా మారిపోయింది.

సిబ్బంది కొరత

చోడవరం, మాడుగుల మార్కెట్ కమిటీలకు చాలాకాలంగా రెగ్యులర్ ఉద్యోగులు లేరు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోనే నెట్టుకువస్తున్నారు. ఒక్కో కార్యాలయానికి కార్యదర్శి, సూపర్‌వైజర్‌తో పాటు దిగువస్థాయి సిబ్బందితో కలిపి పది మంది ఉండాలి. చోడవరంలో ప్రస్తుతం కార్యదర్శి సూపర్‌వైజర్‌తోపాటు ఏడుగురే ఉన్నారు. మాడుగులలో ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. చోడవరం మార్కెట్ కమిటీ కార్యదర్శి, మాడుగులకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

కొరవడిన నిఘా

మార్కెట్ కమిటీల్లో తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో చెక్‌పోస్టులు కూడా తగ్గిపోయాయి. దీనివల్ల కమిటీలకు వచ్చే ఆదాయం తగ్గిపోతున్నది. చోడవరం పరిధిలో గతంలో ఐదు చెక్‌పోస్టులు ఉండగా, ప్రస్తుతం వెంకన్నపాలెం, వడ్డాదిలో మాత్రమే చెక్‌పోస్టులు నడుస్తున్నాయి. సిబ్బంది కూడా పరిమితంగానే ఉండడంతో వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల రవాణాపై పూర్తిస్థాయి నిఘాకు అవకాశం లేకపోయింది. దీని వల్ల మార్కెట్ కమిటీలకు ఆదాయం రావడంలేదు. మార్కెట్ కమిటీలకు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి కార్యకలాపాలను ముమ్మరం చేయడం ద్వారా ఆదాయం పెంచుకునే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


వరి నూర్పు యంత్రం బోల్తా.. ఇద్దరి మృతి



మృతిచెందిన గణేశ్, నాయుడు

రావికమతం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ రోడ్డులో మంగళవారం రాత్రి వరి నూర్పు యంత్రం బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపిన వివరాల మేరకు మాడుగుల మండలం వమ్మలిలో ఒక రైతుకు చెందిన వరి నూర్పు యంత్రం మాకవరపాలెం మండలంలో వరి నూర్పులకు వెళ్లి, మంగళవారం రాత్రి తిరిగి వమ్మలికి బయలుదేరింది. దారిలో తట్టబంద రోడ్డులో నుంచి రావికమతం మెయిన్ రోడ్డులోకి మలుపు తిరిగే క్రమంలో ట్రాక్టర్ వెనుక వున్న నూర్పు యంత్రం బోల్తాపడింది. దీంతో నూర్పు యంత్రం, ట్రాక్టర్‌కి మధ్య రాడ్‌పై నిల్చుని ఉన్న కూలీలు జొన్నపల్లి గణేశ్, జొన్నపల్లి నాయుడు జారిపోయి నూర్పు యంత్రం కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రఘువర్మ సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. బోల్తా పడిన వరి నూర్పు యంత్రాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో పైకి తీయించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నాగచైతన్య సందడి



యంగ్ హీరో అక్కినేని నాగచైతన్య మంగళవారం విశాఖలో సందడి చేశారు. నగరంలోని రామాటాకీస్‌లో 'తండేల్' సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో చిత్ర సమర్పకుడు అల్లు అరవింద్, రచయిత కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సత్య పాల్గొన్నారు. -వివరాలు మెయిన్‌లో

అడ్డగోలుగా గ్రావెల్, మట్టి దందా


పేదల ఇళ్ల స్థలాల లేఅవుట్లలో యథేచ్ఛగా తవ్వకాలు

- అక్రమార్కులకు వీఎంఆర్‌డీఏ సిబ్బంది సహకారం



గంగవరంలో గ్రావెల్ తవ్వుతున్న ప్రాంతం

సబ్బవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం, నంగినారపాడు, పైడివాడ, పైడివాడ అగ్రహారం, గాలిభీమవరం, అసకపల్లి గ్రామాల్లో పేదల ఇళ్ల నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్లలో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు అడ్డగోలుగా సాగుతున్నాయి. అదే విధంగా రాయపుఅగ్రహారం, అమృతపురం, ఎల్లుప్పి గ్రామాల్లో కూడా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. రోజూ అర్ధరాత్రి దాటిన తరువాత నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు గ్రావెల్ తవ్వి, టిప్పర్ల ద్వారా తరలించుకుపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. అక్రమార్కులతో వీఎంఆర్‌డీఏ కింది స్థాయి సిబ్బంది కుమ్మక్కై పేదల ఇళ్ల స్థలాల లే-అవుట్లలో గ్రావెల్ తవ్వకాలను ప్రోత్సహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ మైనింగ్, రెవెన్యూ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు అధికారులు దాడులు చేస్తే.. కాలనీల్లో ఇళ్ల పునాదులు నింపడానికి గ్రావెల్ తవ్వుతున్నట్టు చెబుతూ, అధికారులను పక్కతోవ పట్టిస్తున్నారు. ఇక్కడ తవ్వుకున్న గ్రావెల్, మట్టిని టిప్పర్ల ద్వారా వెదుళ్లనరవ, అజనగిరి, కొత్తూరు, గాజువాక మండలం దువ్వాడ రెవెన్యూ పరిధిలో పలు ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి పగటిపూట గాజువాక, కూర్మన్నపాలెం, అగనంపూడి, లంకెలపాలెం, తదితర ప్రాంతాల్లో ప్రైవేటు లే-అవుట్లు, ఇళ్ల నిర్మాణంలో పునాదులు కప్పడానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కాగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు... అక్రమ గ్రావెల్ తవ్వకాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని చెబుతున్నప్పటికీ ... మిగతా 6వ పేజీలో



ఇంటర్వ్యూ..

రూ.15 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు

వై.హరి, పీఆర్ డీఈఈ, పాయకరావుపేట



(ఆంధ్రజ్యోతి/పాయకరావుపేట రూరల్)

ప్రశ్న: పల్లె పండగలో మొదటి విడత ఎన్ని రోడ్లు, డ్రైన్లు మంజూరయ్యాయి? వీటిని ఏ నిధులతో నిర్మిస్తున్నారు.

జవాబు: సబ్ డివిజన్‌లోని పాయకరావుపేట మండలంలో 37 పనులకు రూ.1.99 కోట్లు, నక్కపల్లి మండలంలో 47 పనులకు రూ.2.21 కోట్లు, ఎస్.రాయవరం మండలంలో 44 పనులకు రూ.2 కోట్లు, కోటవురట్ల మండలంలో 80 పనులకు రూ.1.88 కోట్లు మంజూరయ్యాయి. మొత్తం 195 పనులకు రూ.8.08కోట్లు మంజూరయ్యాయి. వీటిని 75 శాతం ఎన్ఆర్‌జీఎస్ నిధులు, 25 శాతం పంచాయతీ నిధులతో నిర్మిస్తున్నాం.

ప్రశ్న: ఈ రోడ్లు పూర్తయ్యాయా?

జవాబు: పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో సిమెంటు రోడ్లు పూర్తయ్యాయి. కోటవురట్ల మండలంలో కొన్ని పూర్తి కావలసి ఉంది.

ప్రశ్న: వేసిన రోడ్లకు బిల్లులు అవుతున్నాయా? ఇబ్బందులున్నాయా?

జవాబు: పల్లె పండగలో పూర్తి చేసిన సిమెంటు రోడ్లకు విడతల వారీగా వెంటనే బిల్లులు విడుదలవుతున్నాయి. మొదటి విడతలో వేసిన రోడ్లకు 80 శాతం బిల్లులు చెల్లించాం

ప్రశ్న: పల్లె పండగలో రెండో విడత ఎన్ని రోడ్లు, డ్రైన్లు మంజూరయ్యాయి?

జవాబు: రెండవ విడతలో నాలుగు మండలాల్లో 120 సిమెంటు రోడ్లు, డ్రైన్లకు రూ.6.92 కోట్లు మంజూరయ్యాయి. వీటిని త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

కలుపు తీసే బ్యాటరీ యంత్రాన్ని తయారు చేయడం అభినందనీయం


ట్విట్టర్‌లో హోం మంత్రి అనిత

పాయకరావుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి ఉపయోగపడే కలుపు తీసే బ్యాటరీ యంత్రాన్ని విద్యార్థులు రూపొందించడం అభినందనీయమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అనకాపల్లి వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులు బ్యాటరీతో పనిచేసే కలుపు తీసే యంత్రాన్ని రూపొందించడం పట్ల మంగళవారం ట్విట్టర్ వేదికగా మంత్రి అనిత స్పందించారు. విద్యార్థులు తక్కువ ఖర్చుతో సమకూర్చుకోగలిగే మరిన్ని యంత్రాలు రూపొందించాలని ఆకాంక్షించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మునగపాక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

నేడు మునగపాక గౌరీపరమేశ్వరుల సారె సంబరం



మునగపాక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గౌరీ పరమేశ్వరులు సారె ఊరేగింపు బుధవారం జరగనుందని ఉత్సవకమిటీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు, పొలిమేర గణేష్ తెలిపారు. పెద్ద ఎత్తున మహిళలు భాగస్వాములై అమ్మవారికి సారె తయారు చేయాలని కోరారు. సాయంత్రం 6 గంటలకు పెద్ద మదుం జంక్షన్ నుంచి సారె ఊరేగింపు మొదలవుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ నిర్వహణ పనుల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు. పురుషోత్తపురం, పోతురెడ్డిపాలెం, రుక్మిణిపురం, రేగుపాలెం, వెంకునాయుడుపాలెం, పులపర్తి, పీఎస్ఆర్‌పేట, బయ్యవరం, విశాఖ డెయిరీ, వైశాఖ బయో మెరైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించాలని తెలిపారు.

'పేట' ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా రేపు

పాయకరావుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు మంగళవారం తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో గురువారం నాలుగు ప్రముఖ కంపెనీలతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఇంటర్వ్యూల్లో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ వరకు చదువుకుని 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

గండివానిపాలెంలో దర్జాగా గ్రావెల్ తవ్వకాలు

- బార్క్ ప్రహరీ గోడకు ఆనుకుని తవ్వకం
- బరితెగించిన రోడ్డు కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు

అచ్యుతాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోసూరు పంచాయతీ గండివానిపాలెంలో పట్టపగలు ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ తవ్వకాలు జరుపుతునా్న అధికారులు పట్టించుకోవడం లేదు. గండివానిపాలెంలో అంతర్గత రోడ్లు వేస్తున్నారు. దీనికి గ్రావెల్ కావాలి. అధికారిక క్వారీల నుంచి గ్రావెల్ కొనుగోలు చేసి రోడ్డు నిర్మించాలి. కాని మండలంలో ఎక్కడ అధికారిక గ్రావెల్ క్వారీలు లేవు. దీంతో కాంట్రాక్టర్లు రెవెన్యూ అధికారుతో కుమ్మక్కయి సోమవారం ఉదయం నుంచి గ్రావెల్ తవ్వకాలు ప్రారంభించారు. ఎవరైనా మారుమూల ప్రాంతాల్లో కొండ ప్రాంతం నుంచి గ్రావెల్ తవ్వకాలు జరుపుతారు. కాని ఇక్కడ రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్ బరితెగించి అచ్యుతాపురం-తంతడి ప్రధాన రహదారిని ఆనుకొని బాబా ఆటమిక్ రీసెర్క్ సెంటర్ (బార్క్) గోడ పక్కన ఉన్న గ్రావెల్‌ని దర్జాగా తవ్వేస్తున్నారు. దోసూరు, గండివానిపాలెం, తాళ్లదిబ్బ గ్రామాల పరిధిలో సుమారు 2200 ఎకరాలు బార్క్‌కి కేటాయించారు. ఈ స్థలం చుట్టూ ప్రహరీని బార్క్ నిర్మించింది. ప్రస్తుతం ఈ గోడను ఆనుకొని ఉన్న గ్రావెల్‌ని పట్టపగలు తవ్వేస్తున్నారు. భవిష్యత్‌లో ఏమాత్రం వర్షం పడినా బార్క్ ప్రహరీ గోడ కూలిపోయే అవకాశం ఉంది. అయినా ఉపేక్షించకుండా గ్రావెల్ తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు అండదండలుండడం వల్లే విచక్షణా రహితంగా గ్రావెల్ తరలిస్తున్నారని గ్రామస్థులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.



బార్క్ ప్రహరీ గోడను ఆనుకొని గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

- జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి

ఎలమంచిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్ర రక్షిత నీటి పథకాల ద్వారా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపడతామని జిల్లాపరిషత్ సీఈఓ నారాయణమూర్తి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఏటికొప్పాక పంచాయతీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక రక్షిత నీటి పథకాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో తెల్లని సుద్ద వస్తుందని, ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని నేతలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఎలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో పర్యటించి సీపీడబ్ల్యూ పథకాల నిర్వహణ తీరును, సమస్యలను గుర్తించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న 45 రక్షిత నీటి సరఫరా స్కీమ్‌ల్లో ఇప్పటికే 22 స్కీమ్‌లను పరిశీలించినట్టు చెప్పారు. ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎలమంచిలి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ దుర్గాప్రసాద్, జేఈఈ సత్యకుమార్, ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, ఏఓ ప్రసాద్, సెక్రటరీ ప్రసాద్, సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఏటికొప్పాక పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నారాయణమూర్తి

మార్చి నాటికి అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

పాయకరావుపేట: మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల మార్చి నాటికి పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. తొలుత రికార్డులు పరిశీలించి, ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు, వీధి లైట్లు, రక్షిత నీటి సరఫరాలో సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అరటిగెలల మార్కెట్‌లోని సీపీడబ్ల్యూఎస్ ట్యాంకులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వై.ఆనంద్‌కుమార్, ఏఈ ఫణికుమార్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సీహెచ్‌ఆర్‌కే.వర్మ తదితరులున్నారు.

ఘనంగా చిక్కాల జన్మదిన వేడుకలు



చిక్కాల రామారావును గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు



చిక్కాల రామారావుకు కేకు తినిపిస్తున్న వైసీపీ నేతలు

పాయకరావుపేట రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటకోటలో మంగళవారం వైసీపీ మండల అధ్యక్షుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ చిక్కాల రామారావు జన్మదిన వేడుకలను నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, కురశాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్సీలు డీవీవీ సూర్యనారాయణ, లక్ష్మీ శివకుమారి, అనకాపల్లి పార్లమెంటు నియోజవర్గ వైసీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు కురశాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రజలకు, కార్యకర్తలకు సేవ చేస్తున్న మంచి రాజకీయ నాయకుడు చిక్కాల రామారావు అన్నారు. చిక్కాల రామారావు మాట్లాడుతూ జన్మదిన వేడుకలను జరుపుకోవడం ముఖ్యోద్దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను పిలిచి వారికి ధైర్యం, భరోసా కల్పించడం కోసమేనన్నారు. అనంతరం నాలుగు మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు చిక్కాల రామారావును భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లంకా సూర్యనారాయణ, వైసీపీ నాయకులు బొడ్డేడ ప్రసాద్, దగ్గుపల్లి సాయిబాబా, ధనిశెట్టి బాబూరావు, గెడ్డమూరి శ్రీనివాసరావు, మహేశ్, జగతా శ్రీనివాసరావు, ఇసరపు తాతారావు, చేపల తాతాజీ, దేవుడు, వంగలపూడి రామారావు, పన్నీరు పాపారావు, రాజేశ్‌ఖన్నా, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.రాజు



సమావేశమైన మాలమహానాడు రాష్ట్ర నాయకులు

పాయకరావుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.రాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక దళిత బహుజన పార్టీ కార్యాలయంలో జరిగిన మాలమహానాడు రాష్ట్ర నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసేందుకు కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే మాల, మాదిగ, రెల్లి కులాలతోపాటు ఎస్సీ జాబితాలోని 59 కులాలకు విద్యా, ఉద్యోగం, ఇతర సామాజిక జీవన రంగాల్లో నష్టం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్‌రంజన్ కమిషన్ ఇచ్చిన నివేదికను అమలు చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి నెలాఖరులో పాయకరావుపేటలో మాలల సమరభేరి సభ, ప్రదర్శన, ఆందోళన నిర్వహిస్తామన్నారు. అనంతరం మాలమహానాడు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నక్కపల్లి మండలం గొడిచెర్లకి చెందిన బిందడి రాజేష్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పులి పాండురాజు, ప్రధాన కార్యదర్శులు మీలా గోపి, దాసరి రామచంద్రరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బోడపాటి రమణబాబు, జిల్లా శాఖ అధ్యక్షుడు తట్టా శ్రీనివాసరావు, పాయకరావుపేట అసెంబ్లీ ఇన్‌చార్జి బడుగు అచ్చారావు పాల్గొన్నారు.

తాండవ వంతెనపై చేపల విక్రయానికి బ్రేక్



చేపలు విక్రయించవద్దని హెచ్చరిస్తున్న పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి వర్మ

పాయకరావుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తాండవ వంతెన ఫుట్‌పాత్‌పై చేపలు విక్రయాల నియంత్రణకు చర్యలు చేపట్టామని పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సీహెచ్‌ఆర్‌కే వర్మ తెలిపారు. ఇకపై ఎవరైనా వంతెనపై చేపలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాండవ వంతెనపై చేపల విక్రయాలతో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలిగిస్తున్న విషయమై పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం వర్మ వచ్చి తాండవ వంతెనపై చేపలు విక్రయిస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాండవ వంతెనపై ప్రతిరోజూ రెండు పూటలా సిబ్బంది పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా తుని వైపు వంతెనపై కూడా చేపల విక్రయాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని తుని మున్సిపల్ అధికారులను కోరనున్నామన్నారు.

ఉండవల్లి శ్రీదేవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

మునగపాక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అదే కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ వ్యాఖ్యలు కేవలం శ్రీదేవికి పరిమితం కాదని, స్త్రీజాతికి అవమానకరమన్నారు. ఈ అంశంపై డీజీపీ స్పందించి అనుచిత వ్యాఖ్యలుచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలన్నారు.

టి.జగ్గంపేటలో పశు ఆరోగ్య శిబిరం

కోటవురట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.జగ్గంపేట పంచాయతీలో మంగళవారం పశు ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు కె.వెంకటాపురం వైద్యుడు బాబూరావు పడాల తెలిపారు. ఈ శిబిరంలో పశువులకు వైద్యం, గర్భకోశ వ్యాధులకు చికిత్స,వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని గోవిందపాలెం, కొత్తపట్నం గ్రామాల్లో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలను రాంబిల్లి, పంచదార్ల పశువైద్యాధికారులు డాక్టర్‌లు కె.రఘునాథ్, మాధురి నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి పాడిరైతులకు మందులను అందజేశారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పట్టించారు.

చినదొడ్డిగల్లు గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన సెక్రటరీ

నక్కపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ఆర్‌సీహెచ్ వెంకటరావు తనిఖీ చేశారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పాఠకుల సమస్యలు ఏమైనా వున్నాయా ? అని ఆరా తీశారు. పాఠకుల సంఖ్య పెంచి, ప్రతీ ఆదివారం విద్యార్థులతో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలని గ్రంథాలయాధికారి కె.జనార్దన్‌కు సూచించారు.

ఎలమంచిలిలో ప్రజా సంఘాల ఆందోళన



బస్టాండ్ జంక్షన్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ప్రతినిధులు

ఎలమంచిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచార నిందితుడిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపించాలని, మద్యం, మత్తు పదార్థాలను అరికట్టాలని కోరుతూ పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద మంగళవారం సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ శివాజీ, ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ బాలికకు చదువు బాధ్యత ప్రభుత్వమే తీసుకుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఎలమంచిలిలో మద్యం గొలుసు దుకాణాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సంఘాల ప్రతినిధులు ఎం. బాలాజీ, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

రాంబిల్లి, జనవరి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కట్టుబోలు, మామిడివాడ గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ వరిలో ఎకరానికి 20 కేజీల యూరియా, పొటాష్ 15 కేజీలు దుక్కిలోను, 15 కేజీలు పొట్టదశలోను వేయడం వల్ల పైరు ఏపుగా పెరిగి తాలుగింజలు రాకుండా చేస్తుందన్నారు. ప్రారంభ దశలోనే వేపనూనె పిచికారీ చేయడం ద్వారా ఆకుముడతను నియంత్రించవచ్చునన్నారు. రైతులు తప్పనిసరిగా పంట నమోదుతోపాటు, ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ప్రశాంతి, ఏఈఓ సంతోషి, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అపరాలలో అధిక దిగుబడులు

పాయకరావుపేట రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అపరాల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో పి.ఆదినారాయణ అన్నారు. మండలంలోని ఈదటం, పాల్మన్‌పేట గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వం అందించే సబ్సిడీలు, ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, ప్రియాంక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి

పాయకరావుపేట రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ మాజీ డైరెక్టరు గెద్దం కన్నబాబు అన్నారు. మంగళవారం గుంటపల్లిలో పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 34 పశువులకు గర్భకోశ చికిత్సలు, 26 పెయ్యలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేసినట్టు శ్రీరాంపురం పశు వైద్యాధికారి కేవీజేఆర్ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో సహాయకులు హర్ష, కళ్యాణి, హరికృష్ణ, లచ్చబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ని అందరూ గౌరవించేలా చర్యలు

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభిరామ్



సంవిధాన్ గౌరవ్ అభియాన్ సభలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

అచ్యుతాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ని అంతా గౌరవించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభిరామ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం సంవిధాన్ గౌరవ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంబేడ్కర్‌ని గతంలో చాలా సందర్భాల్లో చులకన భావంతో చూశారన్నారు. అటువంటిది రాహుల్‌గాంధీ తెల్ల టీషర్టు ధరించి నిరసన వ్యక్తం చేయడం హాస్యాస్పదమన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజానసన్యాసినాయుడు, మండల శాఖ అధ్యక్షుడు రాజాన రాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు, జేవీఎస్ రాజు, రాష్ట్ర సైనిక సెల్ కో-కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, ఒరుపుల జయశంకర్, శీరా చిరంజీవి, మామిడి సురేష్, రాజాన పార్థు, కర్రి వెంకటస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

బీజేపీ పట్టణ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు శివ, నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు తెరపల్లి అప్పలరాజు, నక్కా శివశంకర్, పిట్టా దాసుబాబు, పప్పు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మిక సొసైటీలకు మద్యం దుకాణాలు ఇవ్వాలి



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నేతలు

రాంబిల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గీత కార్మిక సొసైటీలకు మద్యం దుకాణాలు కేటాయించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సంఘాల ప్రతినిధులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గీత సహకార సంఘాల సమైఖ్య కన్వీనర్ పెంకే మారేసు మాట్లాడుతూ గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించే జీవో నంబరు 13ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మద్యం దుకాణాలను గీత కార్మిక సొసైటీలకు కేటాయించాలని కోరారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు పిల్లి శ్రీను, నాగు, దుంగా అప్పలనాయుడు, రమణ, నూకరాజు పాల్గొన్నారు.

బంగారమ్మపాలెంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



బంగారమ్మపాలెంలో ఉత్సాహంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

ఎస్.రాయవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారమ్మపాలెంలో మంగళవారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. స్థానిక వల్లభేశ్వరస్వామి తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 16 కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన ఈ పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, మాజీ అధ్యక్షుడు వెంకటరాజు, సీనియర్ నాయకుడు గుర్రం రామకృష్ణ నాయకులు పాల్గొన్నారు. అలాగే బంగారమ్మపాలెంలో మంగళవారం వల్లభేశ్వరస్వామి తీర్థం ఘనంగా జరిగింది. తీర్థానికి వచ్చిన వారందరూ వల్లభేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అలాగే బొమ్మల దుకాణాలు, రంగుల రాట్నాల వద్ద స్థానికులు సందడి చేశారు.

జడ్పీ సీఈవోకు ఘన సన్మానం



జడ్పీ సీఈవో నారాయణమూర్తిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

నక్కపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా జడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో వుంచుకుని నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఇటీవల గణతంత్ర వేడుకల్లో ఉత్తమ అవార్డు స్వీకరించిన సీఈవో నారాయణమూర్తిని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ మణిరాజు, పొడగట్ల పాపారావు, మనబాల తాతారావు, గోవింద్ తదితరులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఉత్తమ అవార్డులు పొందిన తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజులను కూడా సత్కరించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



మాటూరి సరోజినిని సత్కరిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ మాటూరి సరోజిని అన్నారు. మండలంలోని గుంటపల్లి జడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం, టీచర్లు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు వెంకన్న, నాగూర్, శ్రీనివాసరావు, సుధాకర్, రవిబాబు, శ్యామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



డైరెక్టర్ రమేశ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

గొలుగొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన గొలుగొండ గ్రామానికి చెందిన పుల్లేటికుర్తి రమేశ్ విజయవాడలో మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ గొలుగొండ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు పారేపల్లి నాగేశ్వరరావు, రాయపురెడ్డి జమీలు, చిట్టిబాబు, లోవ, శివ తదితరులు డైరెక్టర్ రమేశ్‌ను ఘనంగా సన్మానించారు.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండుగ



అమ్మవారి ఘటాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

మాడుగుల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని అలంకరించిన తర్వాత ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అలాగే గ్రామానికి చెందిన పలువురు భక్తులు ఘటాల పండుగను నిర్వహించి, మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మాజీ సర్పంచ్ అప్పారావు మృతి

కృష్ణాదేవిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాతకృష్ణాదేవిపేట మాజీ సర్పంచ్ పందిరి అప్పారావు (80) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఇంటి వద్ద మరణించారు. అప్పారావు కాంగ్రెస్ 1979 నుంచి వరుసగా మూడుసార్లు, 2004లో ఒకసారి కలిపి 20 ఏళ్లకు పైగా సర్పంచ్‌గా కొనసాగారు. ఆయన పెద్ద కుమారుడు సత్యంనాయుడు ప్రస్తుతం పాతకృష్ణాదేవిపేట సర్పంచ్‌గా ఉన్నారు. అప్పారావు మృతికి జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, ఎంపీపీ జి.మణికుమారి, ఎంపీటీసీలు బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ భాస్కరనాయుడు, అన్ని పార్టీల నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

ఇదేనా.. చె(చి)త్తశుద్ధి?

గ్రామాల్లో చెత్త వాతావరణం

- పరమ అధ్వానంగా పారిశుధ్యం
- రహదారులపై పేరుకుపోయిన వ్యర్థాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

గ్రామాల్లో 'చెత్త' వాతారణం స్వాగతం పలుకుతోంది. ఊరిలో అడుగిడగానే చెత్త గుట్టలుగా తారసపడుతోంది. రహదారుల పక్కనే వ్యర్థాలు పేరుకుపోయి పారిశుధ్యం పరమ అధ్వానంగా తయారైంది. అధికారులు, పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో స్వచ్ఛత కరుమరుగైంది.



లచ్చన్నపాలెం ప్రవేశంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త కుప్పలు



లచ్చన్నపాలెం గ్రామంలో చెత్త కుప్పలకు పెట్టిన నిప్పు

మాకవరపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు లచ్చన్నపాలెం గ్రామ ప్రవేశాలు, శివారున వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పంచాయతీ సిబ్బంది వీటిని తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రహదారులపై చెత్త కుప్పలకు నిప్పుపెట్టి విడిచిపెడుతున్నారు. ప్రతీ శనివారం స్వచ్ఛత సేవా కార్య క్రమంలో అంటూ అధికారులు ప్రచారం చేస్తున్నా, పారిశుధ్య పనుల మాత్రం చేపట్టం లేదని గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

లచ్చన్నపాలెం గ్రామంలో చెత్త సంపద కేంద్రం లేకపోవడంతో రహదారులపైనే వ్యర్థాలను వదిలేస్తున్నారు. దానికి వారంలో ఒక రోజు నిప్పు పెడుతున్నారు. దీనివల్ల గ్రామ శివారులో పొగకు రహదారిలో రాకపోకలు సాగించే వారితో పాటు స్థానిక ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇటీవల సంక్రాంతి పండగ కావడంతో చెత్త మరింత పేరుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. చెత్త, వ్యర్థాలతో వస్తు దుర్వాసన భరించలేకపోతున్నామని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మాకవరపాలెంలో చెత్తసంపద కేంద్రం ఉన్నప్పటికీ, గ్రామం మధ్యలో ఉన్న సంత స్థలంలోనే చెత్తను డంపింగ్ చేస్తున్నారు. ఈ చెత్త కుప్పలతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించిన ఆయా గ్రామాల్లో చెత్తాచెదారాన్ని తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.



మాకవరపాలెం మధ్యలోని ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి చెందగా, అతని కుటుంబానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ బాసటగా నిలిచారు. ఏపీపురం పంచాయతీ ఉప్పరగూడెం గ్రామానికి చెందిన నక్క అచ్చయ్య తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. మృతిని కుటుంబానికి విజయ్ సొంత నిదుల నుంచి రూ.1.5 లక్షలు అందజేస్తానని మాటిచ్చారు. ఈ మేరకు చింతకాయల పద్మావతి చేతుల మీదుగా మంగళవారం చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు ఎన్.వెంకటరమణ, సర్పంచ్ పైల రమేశ్ నాయుడు, మాజీ సర్పంచ్ పారుపల్లి రమాచంద్ర, ఎంపీటీసీ సభ్యుడు లోక లోవరాజు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

నర్సీపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని పెదబొడ్డేపల్లికి చెందిన బోళెం రాజబాబు భార్య సతీమణికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.54 లక్షల చెక్కును టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మంగళవారం అందజేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో 16 మందికి సీఎం సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేసినట్టు ఈ సందర్భంగా విజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పదో వార్డు కౌన్సిలర్ రాజునాయుడు, పార్టీ నేత సబ్బవరపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో రన్నింగ్ ట్రాక్ నిర్మాణం

- సమగ్రశిక్ష అభియాన్ జేఈ రమణాజీ



మాకవరపాలెం పాఠశాలలో నిర్మిస్తున్న రన్నింగ్ ట్రాక్

మాకవరపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రూ.5 లక్షలతో రన్నింగ్ ట్రాక్ పనులు చేపడుతున్నట్టు సమగ్రశిక్ష అభియాన్ శాఖ జేఈ రమణాజీ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంఎస్) పథకం కింద మాకవరపాలెం, గిడుతూరు ఉన్నత పాఠశాలలు ఎంపికైనట్టు చెప్పారు. ఇందులో భాగంగా ఏడాదికి ఈ పాఠశాలలకు రూ.2 కోట్ల నిధులు మంజూరవుతాయని చెప్పారు. ఈ నిధులతో పాఠశాలల్లో భవనాలు, ఆటస్థలాలు, కంప్యూటర్ గదులు తదితర పనులు చేపడుతున్నట్టు వివరించారు. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో రూ.5 లక్షలతో రన్నింగ్ ట్రాక్, రూ.18 లక్షలతో కంప్యూటర్ భవనం నిర్మిస్తున్నామని ఆయన చెప్పారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



శిక్షణ తరగుతుల్లో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం 57 మంది విద్యా వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 570 మంది చదువు రాని వయోజనులను గుర్తించామని, వీరికి రాత్రి వేళలో గంటన్నర పాటు అక్షరాలు నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి పి.పార్థసారధి, వెలుగు ఏపీఎం కనకరాజు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ తల్లిబాబు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనకు పటిష్ట చర్యలు

-వై.తారకేశ్వరరావు, ఎస్ఐ



సైబర్ క్రైమ్ నిరోధానికి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. అజ్ఞాత కాల్స్ వస్తే భయపడకుండా 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నాం. నాటుసారా, బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయాలు, గంజాయి రవాణాపై నిఘా పెడుతున్నాం. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను ఏ విధంగా చైతన్యవంతం చేస్తున్నారు?

జవాబు: పాఠశాలలు, కళాశాలలు, తదితర 28 చోట్ల అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. అజ్ఞాత కాల్స్ వచ్చిన తర్వాత భయపడకుండా 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నాం.

ప్ర: 2024 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు స్టేషన్ పరిధిలో ఎన్ని గంజాయి కేసులు నమోదు చేశారు?

జ: పది కేసులు నమోదు చేసి, సుమారు వెయ్యి కిలోల గంజాయితో పాటు ఒక కారు, ఆటో, ఐదు బైకులు, స్వాధీనం చేసుకున్నాం. 28 మందిని రిమాండ్‌కు తరలించాం.

ప్ర: కృష్ణాదేవిపేటలో ట్రాఫిక్ నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

జ: సోమవారం ప్రధాన కూడలి వద్ద ఏఎస్ఐతో పాటు కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నాం. నిబంధనలు పాటించని 600 వాహన చోదకులకు జరిమానా విధించాం.

ప్ర: గ్రామాల్లో సారా, బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: వీటిపై నిరంతరం నిఘా పెడుతున్నాం. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 50 కేసులు నమోదు చేశాం. ఎప్పటికప్పుడు దాడులు చేసి సారా పులుసు ధ్వంసం చేస్తున్నాం.

ప్ర: మైత్రి గ్రంథాలయాల అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలేమిటి?

జ: నిరుద్యోగ యువతకు కానిస్టేబుల్, ఎస్ఐ, వివిధ పోటీ పరీక్షలకు రూ.15 వేలు పుస్తకాలతో రీడింగ్ వీల్ చైర్లను గత డీఎస్పీ మోహన్ చేతుల మీదుగా అందించాం. ఏఎల్‌పురం హైస్కూల్‌లో రన్నింగ్ ట్రాక్ గ్రౌండ్ తయారీ చేసి, పోలీసు ఉద్యోగాల పోటీ పరీక్షల అభ్యర్థులకు అందుబాటులో ఉంచాం.

ప్ర: ఇసుక అక్రమ రవాణాపై నిరోధానికి ఏ చర్యలు చేపడుతున్నారు?

జ: చోద్యం, లింగంపేట వంతెన సమీపంలో రెవెన్యూ అధికారులతో కలిసి ట్రెంచులు తవ్వించాం. అలాగే ఆకస్మికంగా తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిని పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నాం.

-కృష్ణాదేవిపేట, ఆంధ్రజ్యోతి

నేడు పీఏసీఎస్‌లో అవకతవకలపై విచారణ

రోలుగుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురం పీఏసీఎస్‌లో చోటుచేసుకున్న అవినీతిపై సొసైటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై బుధవారం విచారణ చేపట్టనున్నట్టు ఆ శాఖ నర్సీపట్నం అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.శ్రీనివాసరావు తెలిపారు.

ఫిర్యాదుదారులతోపాటు సొసైటీ సీఈఓ, ఇతర సిబ్బంది హాజరు కావాలని కోరారు. ఈ సొసైటీలో 200 మందికి పైగా బినామీల పేరతో రుణాలు పొందడం, కోటికి పైగా సొసైటీ నిధులు స్వాహా చేశారన్న ఆరోపణలపై విచారణ నిర్వహిస్తున్నారు.

జన్నవరం గ్రామ సభలో తాగునీటి సమస్యపై ఆందోళన

చోడవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నవరం పంచాయతీలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో తాగునీటి సమస్యపై అధికారులను స్థానికులు నిలదీశారు. తాగునీటి సమస్య పరిష్కారంలో సర్పంచ్, అధికారులు విఫలం కావడాన్ని స్థానికులు తీవ్రంగా తప్పుపట్టారు. పంచాయతీ పరిధిలోని పెద్దేరు నది నుంచి నీటిని సరఫరా చేయలేకపోవడాన్ని స్థానికులు విమర్శించారు. పంచాయతీలో సమస్యలపై స్పందన లేకపోవడాన్ని స్థానికులు అధికారులను ప్రశ్నించారు.

లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

చీడికాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వేల గొంతుకులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు కోరారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం వచ్చిన సందర్భంగా సోమవారం రాత్రి జి.కొత్తపల్లి దళితవాడలో ఆయన కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 సంవత్సరాలుగా ఆయన చేస్తున్న పోరాటాలకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు కంటిపాము అప్పడు, కన్నయ్య, వేపచేదు అప్పారావు, ప్రకాష్, బి.అప్పారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ముర్రు పాలు పెయ్యిలకు ఇవ్వాలి

- పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ చిన్నయ్య



శిబిరంలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ చిన్నయ్య

దేవరాపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముర్రు పాలు పెయ్యిలకు ఇవ్వడం వలన ఆరోగ్యంగా ఉంటాయని పశు సంవర్ధక శాఖ రాష్ట్ర పరిశీలకులు, విజయవాడ జాయింట్ డైరెక్టర్ ఆర్.చిన్నయ్య అన్నారు. మంగళవారం మండలంలోని చిననందిపల్లిలో ఉచిత మెగా పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో 12,500 క్యాంపులు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈనెల 31 వరకు అన్ని గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. నట్టల నివారణ మందులు, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేసి మందులు ఇస్తామన్నారు. గడ్డి కోత యంత్రాలు 75 శాతం సబ్సిడీపై ఇస్తామన్నారు. పశు బీమా పథకం కింద గత ఐదేళ్లలో 1,133 మంది రైతులకు రూ.110 కోట్లు ఇచ్చామన్నారు. అనకాపల్లి జిల్లాలో 230 పశువులు చనిపోగా 173 పశువులకు రూ.52.5లక్షలు బీమా మొత్తాన్ని చెల్లించామన్నారు. పాడి రైతుల కోరిక మేరకు అదనంగా 25 వేల గోకులం షెడ్డులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మిశ్రమ దాణా సరఫరా చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆయన వెంట అదనపు డైరెక్టర్ రామమోహన్, డిప్యూటీ డైరెక్టర్ దినేష్‌కుమార్, చంద్రశేఖరు, పశు వైద్యాధికారులు మంజుషారాణి, జి.ప్రియాంక, మాజీ సర్పంచ్ సత్యారావు, పోతల రఘు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు పట్టణ పెద్దల అభినందన



ఎంపీడీవో ఆంజనేయులను సత్కరిస్తున్న పట్టణ పెద్దలు

చోడవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు పొందిన స్థానిక ఎంపీడీవో పీఎస్‌జే ఆంజనేయులను మంగళవారం పట్టణానికి చెందిన పెద్దలు అభినందించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆంజనేయులును స్థానిక పెద్దలు దేవరపల్లి వెంకట అప్పారావు, ఎలకా మల్లిబాబు, పప్పు శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి చిన్న, విస్సు పార్దురాజు, శ్యాంసుందర్, గుమ్మాల సత్తిబాబు తదితరులు సత్కరించి, అభినందనలు తెలిపారు.

స్వామినాయుడును పరామర్శించిన బూడి

దేవరాపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన తల్లితండ్రుల కమిటీ మాజీ చైర్మన్ కొరుపోలు స్వామినాయుడును మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మంగళవారం పరామర్శించారు. హాస్పటల్ నుంచి ఇంటికి చేరుకున్న విషయం తెలియడంతో ఆయన వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, సింహాచలంనాయుడు, కె.వీరమణ. లలితానాయుడు, అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

చౌకబారు ఆరోపణలతో రాజకీయాలు చేయొద్దు

- మాజీమంత్రి గుడివాడ అమర్, ధర్మశ్రీలపై జనసేన నేతల ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, మండల నేతలు

చోడవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ ఎమ్మెల్యేలపై చౌకబారు ఆరోపణలతో రాజకీయాలు చేయడం మానుకోవాలని మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీఎమ్మెల్యే ధర్మశ్రీలకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, మండల నేతలు తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సీఎం రమేశ్‌కు కట్టబెడుతున్నారంటూ అమర్, ధర్మశ్రీలు అసత్య ఆరోపణలు చేయడాన్ని వారు తప్పుపట్టారు. పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న గుడివాడ అమర్ హయాంలోనే తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలు మూతపడితే వాటిని ఎందుకు తెరిపించలేకపోయారని ప్రశ్నించారు. తుమ్మపాల ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తామని హామీ ఇచ్చిన అమర్‌నాథ్ ఆ సంగతి మరచిపోయారని విమర్శించారు. ఫ్యాక్టరీ భూములను వైసీపీ నేతలు ఆక్రమించుకోలేదా అని ప్రశ్నించారు. గోవాడ చెరకు రైతులపై మొసలి కన్నీరు కారిస్తే ఎవరూ నమ్మరన్నారు. గుడివాడ అమర్ అనకాపల్లిలో సాగించిన అవినీతి దందాలు ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి ఎంపీతోపాటు కూటమి నేతలంతా కృషిచేస్తున్నామని, గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయని, వైసీపీ హయాంలో శిథిలమైన రోడ్ల పునర్నిర్మాణ పనులు కూడా ప్రారంభమైన సంగతి వైసీపీ నేతలు చూడాలని హితవు పలికారు. అడ్డగోలుగా కూటమి నేతలపై అసత్య ప్రచారాలు మానుకోని పక్షంలో వైసీపీ నేతలు తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు అల్లం రామప్పారావు, గూనూరు మూలినాయుడు, నరవ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

తట్టబందలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

- బాలికతో మేనమామకు పెళ్లి నిశ్చయం
- ఫిబ్రవరి 16న ముహూర్తం
- సమాచారం అందడంతో ఐసీడీఎస్, సచివాలయ అధికారులు కౌన్సెలింగ్
- ఇరు కుటుంబాలకు నోటీసులు జారీ



కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ చేస్తున్న అధికారులు

రావికమతం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తట్టబంద గ్రామంలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్, సచివాలయ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికకు అదే గ్రామానికి చెందిన 30 ఏళ్ల యువకుడు (మేనమామ)తో ఫిబ్రవరి 16న వివాహం జరిపించాలని ఇరు కుటుంబాలు నిశ్చయించుకుని పెండ్లి ఏర్పాట్లు చేస్తున్నాయి. ఆ బాలిక చోడవరం జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. బాల్య వివాహ సమాచారం తెలుసుకున్న రావికమతం ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్ సరోజిని, తట్టబంద, బూరుగుపాలెం అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, ధర్మవతి, గ్రామ సచివాలయ మహిళా పోలీస్ పావని, హెల్ప్‌లైన్ అధికారి రాజు మంగళవారం బాలిక ఇంటికి వెళ్లీ బాల్య వివాహంపై చర్చించారు. బాలికకు వివాహం జరపడం చట్టరీత్య నేరమని హెచ్చరించారు. ఈ వివాహం ఆపకుంటే కేసు నమోదు చేసి చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గ్రామ సర్పంచ్ గోకివాడ రమణ, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా శేషుబాబు, మాజీ సర్పంచ్ రాజాన నర్సింహులు సమక్షంలో ఇరు కుటుంబాల పెద్దలు, బంధువులతో మాట్లాడి బాల్య వివాహం వలన జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాన్ని నిలిపివేయాలని బాలిక, యువకుడు తల్లిదండ్రులకు నోటీసులు అందజేశామని సూపర్‌వైజర్ సరోజిని తెలిపారు.

మేలుజాతి పశువులతో అధిక లాభాలు

- పశుసంవర్ధక శాఖ ఏడీ పుష్ప



లేగ దూడల ప్రదర్శనను తిలకిస్తున్న ఏడీ పుష్ప

రోలుగుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మేలు జాతి పశువుల పెంపకంతోనే పాడి రైతులు అధిక లాభాలను పొందవచ్చునని పశుసంవర్ధక శాఖ ఏడీ పుష్ప అన్నారు. మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో కొనిరెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శనను, పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పాడిరైతులకు రాయితీపై పలు పథకాలను అమలు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో జెర్సీ హెచ్ఎఫ్, ముర్రా, పుంగనూరు, ఒంగోలు, గిర్ వంటి జాతులకు చెందిన 62 లేగదూడలను ప్రదర్శించారు. ఉత్తమంగా నిలిచిన వాటికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సురేష్, నూకేశ్వరరావు, బాలతేజ, నాయకులు పరిసం లోవ, సేనాపతి ఆదినారాయణ, పశువైద్య సిబ్బంది వల్లిక, జగదీశ్వరి, శ్రీను, రమణ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

చోడవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేమునాపల్లిలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు అడ్డూరు పశువైద్యాధికారి ప్రశాంత్, సిబ్బంది పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాదర్, రాయపురాజుపేట, శేమునాపల్లి సర్పంచులు బొడ్డేడ రామునాయుడు, భోగేశ్, నాయకులు జయప్రకాశ్, వెంకట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో..

స్థానిక కర్రివారి కళ్లాల వద్ద మంగళవారం పశువైద్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చిట్టినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ యడ్ల కళావతి, కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా 70 పశువులకు సాధారణ పరీక్షలు, 13పశువులకు గర్భకోశవ్యాధి పరీక్షలు, 5పశువులకు చూడి పరీక్షలు, 42 పశువలకు, 25 పెయ్యిలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని పాడేరు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ నర్సింహులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో శ్రీనాధు శ్రీనివాసరావు, పుప్పాల రమేష్, రంజిత్‌వర్మ, లెక్కల కాశిబాబు, సూర్యనారాయణరాజు, మరువాడ ఈశ్వరరావు, పశువైద్య శాఖ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సౌజన్య, పసువైద్య సహాయకులు చంద్ర కృష్ణారావు పాల్గొన్నారు.

చీడికాడలో..

మండలంలో వీరభద్రునిపేటలో ఉచిత పశువైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ వంటాకు నర్సింహమూర్తి, టీడీపీ నాయకులు సబ్బవరపు గంగునాయుడు, పల్లి రాజుబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖండివరం పశువైద్యాధికారి ఎ.గణేష్ మాట్లాడు తూ, పాడి రైతులు తమ పశువులకు ప్రతి ఏడాది ఉచితంగా టీకాలను వేయించుకోవాల న్నారు. కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు శీరంరెడ్డి సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాలకు నియామకపు ఉత్తర్వులు అందజేత



ఆయాలకు నియామకపు ఉత్తర్వులు అందచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్

కొయ్యూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఇ టీవల ఎంపికైన అంగన్‌వాడీ హెల్పర్లకు మంగళవారం కార్యాలయ సీనియర్ అ సిస్టెంట్ నియామకపు ఉత్తర్వులను అందచేశారు. దవడగొయ్యి అంగన్‌వాడీ కేంద్రానికి గెమ్మెలి రోజా, బి. కొత్తూరు కేంద్రానికి రెల్లి మహాలక్ష్మి, జోగంపేట కేంద్రానికి వంతల కాంతమ్మలకు ఈ ఉత్తర్వులు అందించారు. ఇదిలా ఉండగా రాజులపాడు అంగన్‌వాడీ కేంద్రానికి దరఖాస్తు చేసుకున్న ఒకే దరఖాస్తు కు చెందిన అభ్యర్థి గెమ్మెలి లలిత స్థానికేతరరాలిగా గుర్తించి ఆమెను తిరస్కరించినట్టు తెలిపారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తం



చిన్నగంగవరంలో వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి హిమబిందు

సీలేరు, జనవరి 28 , (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి పట్ల అ ప్రమత్తంగా ఉండాలని ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. మంగళవారం చిన్నగంగవరం గ్రామాన్ని సందర్శించి వైద్య శిబిరాన్ని ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో గిరిజనులకు కుష్ఠు వ్యాధిపైపరీక్షలను నిర్వహించారు. స్పర్శ లేని మచ్చలు కుష్ఠు వ్యాధి కావచ్చునని, సకాలంలో దీనిని గుర్తించడం వల్ల సులభంగా నయం చేసుకోవచ్చునని అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే వెంటనే సంప్రదించాలన్నారు. అనంతరం చిన్నగంగవరం ఎగువవీధిలో వైద్యాధికారి ఇంటింటికి వెళ్లి జ్వరబాధితులను పరీక్షించి రక్త పరీక్షలను నిర్వహించారు. ఇద్దరు జ్వరం తీవ్రంగా ఉండటంతో వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ నాగమణి పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాల రూపకల్పనకు పీఆర్-1 యాప్ సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ గ్రామాల రూపకల్పనకు పీఆర్-1 యాప్ ద్వారా సర్వేను వేగవంతం చేయాలని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పీఆర్-1 యాప్‌లో గ్రామంలో ఎన్ని గృహాలు ఉన్నాయి, ఎన్నిఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. చేపల చెరువులు ఎన్ని? పశు సంపద తదితర వాటిని యాప్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే గ్రామంలో మురుగునీరు చేరే ప్రాంతాల్లో సామాజిక ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ప్రతిపంచాయతీ పరిధిలో సంపద కేంద్రంలో వర్మికంపోస్టు, కంపోస్టు ఎరువులు తయారు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

300 గృహాలకు ఒక సామాజిక భవనం..: ఎంపీపీ



సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ బోయిన కుమారి, తదితరులు

గూడెంకొత్తవీధి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి 300 గృహాలకు ఒక సామాజిక భవనం నిర్మించనున్నట్టు స్థానిక ఎంపీపీ బోయిన కుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని డి.కొత్తూరులో రూ.60 లక్షల నిధులతో పీఎం జన్‌మన్ సామాజిక భవనం నిర్మాణానికి ఎంపీపీ, కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల సామాజిక అవసరాల కోసం గ్రామాల్లో భవనాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొర్ర సుభద్ర, వైస్ సర్పంచి కొర్ర రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు రీమల రాజేశ్వరి, కూటమి నాయకులు కాకూరు శేఖర్, ముక్కలి రమేశ్, కొయ్యాం బాలరాజు, ముక్కలి కల్యాణి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంటా నళిని పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

చింతపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేయనున్నట్టు ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం హౌసింగ్ అధికారులు ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లుతో ఇళ్ల అభ్యర్థుల ఎంపికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో పక్కా గృహాల కోసం 2,889మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. గృహాలు ఎంపికలో నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కె. రమణబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజారావు పాల్గొన్నారు.



మాలింగవలస వద్ద వంతెన నిర్మాణం చేపడుతున్న దృశ్యం



సరియా-మాకనాపల్లి రోడ్డు పనులు

శరవేగంగా అభివృద్ధి పనులు

» మాకలింగవలస వద్ద రూ.1.20 కోట్లతో కల్వర్టు నిర్మాణం

» త్వరలో ఏడు గ్రామాల ప్రజలకు తీరనున్న కష్టాలు

అనంతగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ప్రస్తుతం మండలంలోని అనంతగిరి పంచాయతీ మాలింగవలస సమీపంలోని కల్వర్టు పనులు ప్రస్తుతం శరవేగంగా చేపడుతున్నారు. ఇది పూర్తయితే, ఏడు గ్రామాల ప్రజల రావాణా కష్టాలు తీరనున్నాయి. అయితే, పదేళ్ల కిందట హుద్‌హుద్ తుఫాన్‌కు ఈ వంతెన కొట్టుకుపోయింది. ఆ తరువాత శ్రమదానంతో ఆయా గ్రామాల గిరిజనులు.. గెడ్డపై తాత్కాలికంగా రాళ్లను పేర్చి నడిచేందుకు, చిన్నపాటి వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల భారీ వర్షాలకు అదికాస్తా కొట్టుకుపోవడంతో రాకపోకలకుఅంతరాయం నెలకొంటోంది. ఈ స్థితిలో ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచ్ సోమేల రూతు, గిరిజన సంక్షేమశాఖ అధికారులు ప్రత్యేక చొరవతో మాలింగవలస వంతెనతో పాటుగా పాతకోట మీదుగా నందిగుమ్మి, రేగం వరకు డబ్ల్యూబీఎం రోడ్డుకు 1.20 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు ప్రారంభమయ్యాయి.. మాలింగవలస సమీపంలోని గెడ్డపై వంతెన నిర్మాణం కావడంతో పాతకోట, నందిగుమ్మి, తలారీపాడు, రేగం, మాలింగవలస, తెనెపుట్టు, మద్దిగరువు గ్రామాలకు మేలు జరగనుంది. వంతెనతో పాటుగా రోడ్డు పనులపైనా అధికారులు ప్రత్యేక చూపుతున్నారు..

మాకనాపల్లి నుంచి సరియా రోడ్డు పనులు

మండలంలోని జీనబాడు పంచాయతీ మాకనాపల్లి నుంచి సరియా వరకు రూ.65 లక్షలతో డబ్ల్యూబీఎం రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిలిచిపోయిన రోడ్లన్నీ పునఃప్రారంభం కావడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జడ్పీ అతిథి గృహం మరమ్మతులకు ప్రతిపాదనలు



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ అతిథి గృహం మరమ్మతులు చేపట్టేందుకు రూ.15లక్షల నిధులతో ప్రతిపాదనలు పంపించినట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని కొమ్మంగి పంచాయతీ టెంకలపాడు-కొమ్మంగి రూ.10లక్షల ఉపాధి హామీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణాలకు జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యతో కలిసి ఎంపీపీ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మూలగరువు లో రూ. 4లక్షల జడ్పీ నిధులతో అంగన్‌వాడీ కేంద్రం, రూ. 10 లక్షలతో చింతపల్లి బాలసదనం భవనం మరమ్మతులు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జర్త రూతు, కోఆప్టెడ్ సభ్యుడు నాజర్ వల్లి, గ్రామపెద్దలు లకే సత్యనారాయణ,శ్రీను, పాంగి గణబాబు, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణ పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



మాట్లాడుతున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

అనంతగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసే సత్తా ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడికి ఉందని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 లక్షల ఉద్యోగాలకు కల్పించాలనేలక్ష్యంతో రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిసారించినట్టు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలేసిందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అప్పట్లో పారిశ్రామిక వేతలు భయపడేవారని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నట్టు తెలిపారు. అలాగే, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు బృందం దావోస్‌లో అనేక దేశవిదేశీ కంపెనీల పారిశ్రామికవేత్తలతో చర్చించారన్నారు. పెట్టుబడులకు ఆహ్వానించారన్నారు. ఒక జూమ్ కాల్‌తోనే మిట్టల్ నిస్సన్ స్టీల్ కంపెనీని రూ. 1.46 లక్షల కోట్లు తీసుకు వచ్చిన ఘనత ఐటీ మంత్రి నారా లోకేశ్‌దేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు లక్ష్మణ్, శ్యామ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మతల్లి ఉత్సవాలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ముంచంగిపుట్టు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారెల పంచాయతీ పేటమాలిపుట్టులో మంగళవారం గంగమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గత రెండు రోజులపాటు ఈ ఉత్సవాలు జరిగాయి. తొలి రోజు సోమవారం రాత్రి జాతర జరిగింది. రెండో రోజు మంగళవారం గంగమ్మతల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మండలం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు.

పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతకు కసరత్తు

» వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

» ప్రత్యేక తరగతుల నిర్వహణ



కొయ్యూరు గురుకులంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధనే ధ్యేయంగా కసరత్తు ప్రారంభమైంది. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహణ, అదనపు స్టడీ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి తదితర చర్యలను ఉపాధ్యాయులు తీసుకుంటున్నారు. 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చి 17 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు మండలంలో 11 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలతోపాటు గురుకుల పాఠశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలతో కలిపి మొత్తం 15 పా ఠశాలలకు చెందిన 513 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరంతా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా సంబంధిత విద్యాశాఖాధికారులు నిర్దేశిత 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులను గ్రూపులుగా విభజించి చదివించటం, సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సామర్థ్యం పరీక్షించి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, అదనపు సమయం కేటాయించి సందేహాల నివృత్తి తదితర చర్యలను ముమ్మరం చేశారు. అలాగే విద్యార్థులు పరీక్షల ముందు ఏ విధమైన అనారోగ్యాలకు గురి కాకుండా వారి ఆరోగ్య పరిరక్షణ అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ప్రత్యేక భోజనం, చదుకునే సమయంలో అదనపు పౌష్ఠికాహారం అందిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా జిల్లా కేంద్రం నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందనే భయంతో మండలంలో 15 పాఠశాలల్లో సిబ్బంది శతశాతం ఉత్తీర్ణత సాధించేలా పోటీపడి మరీ కృషి చేస్తుండడం గమనార్హం. దీనికి తోడు ఈ విషయమై ఇప్పటి నుంచే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంఈవో రాంబాబు పాఠశాలల్లో 100 రోజుల కార్యచరణ ప్రణాళికపై ఆకస్మికతనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో టీచర్లు మరింత అప్రమత్తమై విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

1/70 చట్టం జోలికి వస్తే ఖబడ్దార్

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలపై గిరిజన సంఘాల ఆగ్రహం



పాడేరు: మాట్లాడుతున్న గిరిజన సమాఖ్య నాయకులు



అరకులో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

పాడేరురూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతంలో 1/70 చట్టం సవరణకు రాష్ట్ర ప్రభుత్వం లోతైన అధ్యయనం చేయాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై జిల్లాలోని వివిధ సంఘాల నాయకులు భగ్గుమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అయ్యన్న పాత్రుడి వ్యాఖ్యలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ కేంద్రంగా నిర్వహించిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులో 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏ ప్రభుత్వమైనా 1/70 చట్టం జోలికి వస్తే ఖబడ్దార్ అని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. యువతకు ఉపాధి కల్పనకు ఐటీడీఏ నుంచి చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, ఆదివాసీల మనోభావాలను దెబ్బతీసేలా స్పీకర్ మాట్లాడటం సరికాదని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంతాల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థకు ఆదివాసీల భూములను కట్టబెట్టే కుట్రలో భాగంగానే స్పీకర్ ఇటువంటి వాఖ్యలు చేశారన్నారు. గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధర, మారుమూల గ్రామాలకు రహదారి, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలు మెరుగు పరిస్తే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు తనిష్ కుమార్, రాజారావు, బాలరాజు పాల్గొన్నారు. టూరిజం అభివృద్ధి పేరుతో 1/70 చట్టం సవరణ చేయాలని స్పీకర్ వ్యాఖ్యానించడం ఆదివాసీ హక్కులకు విఘాతం కల్పించడమే అవుతుందని గిరిజనసంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. ధర్మన్నపడాల్, పొద్దు బాలదేవ్ అన్నారు.

స్పీకర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

1/70 చట్టం అభివృద్ధికి ఎంతమాత్రం అడ్డం కాదని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అయ్యన్న పాత్రుడు సభాపతిలా కాకుండా మైనింగ్ డాన్‌లా మాట్లాడుతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంత భూముల రక్షణకు ఉద్దేశించి 1/70 భూ బదలాయింపు నిషేధ చట్టం ఏర్పాటు చేశారని, ఈ చట్టం అయ్యన్న పాత్రుడి అక్రమ వ్యాపారాలకు అడ్డం వస్తుందని ఆయన విమర్శించారు ఆయన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా త్వరలోనే జేఏసీ కార్యాచరణ ప్రకటిస్తామని రామారావు దొర అన్నారు. జేఏసీ నాయకులు టి.సురేశ్‌బాబు, బి.నాగరాజు పాల్గొన్నారు.

అరకులోయ: పర్యాటక రంగ అభివృద్ధి కోసం 1/70 చట్ట సవరణ చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన ప్రకటనను తక్షణం వెనక్కి తీసుకోవాలని ఆదివాసీగిరిజన సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, నేత పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు.ప్రాంతీయపెట్టుబడుల సదస్సులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొని ఏజెన్సీలో ఎన్నో వనరులున్నా 1/70 చట్టం వల్ల అభివృద్ధి జరగడంలేదడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ చేసిన ప్రకటన టీడీపీ విధానమా, స్పీకర్ వ్యక్తిగత నిర్ణయమో స్పష్టం చేశారు.

అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నను కలిసిన జీసీసీ చైర్మన్ కిడారి



అయ్యన్నపాత్రుడికి జీసీసీ ఉత్పత్తులను అందిస్తున్న చైర్మన్ శ్రావణ్‌కుమార్

పాడేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌చింతకాయల అయ్యన్న పాత్రుడును తన నివాసంలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీసీసీ ఉత్పత్తులను ఆయనకు బహుమతిగా అందించారు. గిరిజన ప్రాంత అభివృద్ధి, జీసీసీని బలోపేతం చేసేందుకు సహకారం అందించాలని శ్రావణ్‌కుమార్ స్పీకర్‌ను కోరారు. తనకు జీసీసీ చైర్మన్ పదవిని ఇచ్చినందుకు స్పీకర్‌తో పాటు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఇతర పార్టీ పెద్దలకు ఈసందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఆందోళన



విద్యుత్‌శాఖ ఏఈకి వినతిపత్రం అందిస్తున్న మహిళలు

పాడేరురూరల్, జనవరి 28: పాడేరులోని నీలకంఠానగర్ (చాకలిపేట)లో ప్రజలు విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మహిళలు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఏఈకి వినతిపత్రం అం దించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ నీలకంఠానగర్ ప్రాంతంలో సు మారు 80 కుటుంబాలతో జీవనం సాగిస్తున్నామన్నారు. గత ఏడాది నవంబరు నుంచి విద్యుత్ లో వోల్టేజీ సమస్యతో ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు ఆవేదన వ్యక్తంచేశారు. కొద్దిరోజులకిందట విద్యుత్ శాఖ అధికారులు జీసీసీ అధికారులతో చర్చించి జీసీసీ గొడౌన్ వెనుక ప్రాంతంలో ట్రాన్స్‌పార్మర్‌ను నెలకొల్పినట్టు వివరించారు. అయితే, ఆ ప్రాంతంలో ఓ ఉపాధ్యాయుడు ఇంటి పక్కనుంచి వైర్లు వెళ్లడంతో ఆయన తరచూ విద్యుత్ లైన్ తరచూ తొలగిస్తున్నారని వాపోయారు. దీంతో గత 10 రోజులుగా విద్యుత్ సరఫరా సమస్యతో తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులతో చర్చించి రెండు రోజుల్లో విద్యుత్ సమస్య పరిష్కరిస్తామని ఏఈ హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించి అక్కడ నుంచి వెనుదిరిగారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

ఆదుకోవాలని కలెక్టర్‌కు నిర్వాసితుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న నిర్వాసితులు

అరకులోయ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారి నిర్మాణంలో భాగంగా ఇరుపక్కలా ఉన్న ఇళ్లు, దుకాణాలు తొలగిస్తుండడంతో తామంతా నిరాశ్రయులమవుతున్నామని, ఈ స్థితిలోపరిహారం అందించాలని అనంతగిరి మండలం డముకు గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు కలెక్టర్ దినేశ్‌కుమార్‌ను కోరారు. గ్రామస్థులు కొండిబ పంచాయతీ మాజీ సర్పంచ్, డముకుచెందిన వీరన్న, స్థానిక నేత మోహనరావు ఆధ్వర్యంలో అరకు చలి ఉత్సవ్‌లో భాగంగా మంగళవారం ఇక్కడకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి వినతి పత్రమిచ్చారు. రహదారి నిర్మాణంలో ఇళ్లు, దుకాణాలు తొలగించాల్సి వస్తోందని, ఈస్థితిలో తమకు నష్టపరిహారం ఇవ్వడంతోపాటు ప్రత్యామ్నాయంగా స్థలాలను మంజూరు చేయాలని బాధిత కుటుంబాలు విజ్ఞప్తి చేశాయి. స్పందించిన కలెక్టర్ సబ్‌కలెక్టర్‌ను పిలిచి వీరికి న్యాయం చేయాలని సూచించారు. జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి తగున్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు.

వెలుగు వీవోఏల సమస్యలపై పోరాటం

» సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్



వీవోఏల నిరాహార దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ చిన్నయ్యపడాల్

పాడేరురూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. వెలుగు వీవోఏలకు ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వీవోఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.భాను, ఎల్‌బీ.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సామూహిక రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీవోఏల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవడం విచారకమన్నారు. డ్వాక్రా గ్రూపులను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్న వీవోఏలకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న భద్రత ఏదీ అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వీవోఏలకు బకాయివేతనాలు వెంటనే చెల్లించాలని, ఉపాధికి భద్రత, తదితర సమస్యలపై జిల్లాలో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీవోఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.భాను, ఎల్‌బీ.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ లోగా తమ సమస్యలు పరిష్కరించకుంటే ఫిబ్రవరి 1వ తేదీ నుంచి విధులను బహిష్కరించి నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 6 మండలాలకు చెందిన సుమారు 300 మంది వీవోఏలు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా బీఎస్‌ఎఫ్: కమాండెంట్



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న బీఎస్‌ఎఫ్ కమాండెంట్ విజయ్‌కుమార్ పాండే

ముంచంగిపుట్టు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీలకు అండగా ఉంటామని ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతం (ఏవోబీ)లోని అడ్రహల్ బీఎస్‌ఎఫ్ 180 బెటాలియన్ కమాండెంట్ విజయ్‌కుమార్ పాండే అన్నారు. ఆ బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఖల్‌గూడ గ్రామంలో సివిల్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, గిరిజనులకు వంట సామగ్రి, రగ్గులు, దుప్పట్లు, తదితర వస్తువులను పంపిణీ చేశారు. క్రీడా సామగ్రి అందించారు. ఆ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించి సుమారు 231 మందికి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ బెటాలియన్ జవాన్లు పాల్గొన్నారు.

కుంచంగి గ్రామం.. అభివృద్ధికి దూరం!

అడుగడుగునా సమస్యల వెల్లువ

మూడు దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని ప్రధాన రహదారి

ఒకే నెలలో 12 సార్లు ప్రమాదాల బారిన ద్విచక్ర వాహనదారులు

డ్రైనేజీ సదుపాయం లేక రోడ్డుపైనే మురుగు నీరు తిష్ఠ

కొత్తూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం కుంచంగి గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. డ్రైనేజీ సదుపాయం లేక రహదారులపై మురుగు ఏరులై పారుతోంది. ప్రధాన రహదారి నిర్మాణానికి నోచుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారు.

కుంచంగిలో 3300 మంది జనాభా ఉండగా, వారిలో సుమారు 2,300 మంది ఓటర్లు ఉన్నారు. ఇది వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో ఈ ప్రాంతానికి



ఇరువైపులా కాలువలు లేని మరో రహదారి

చెందిన అధిక శాతం ప్రజలు వ్యవసాయం చూసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు తర్వాత అభివృద్ధికి నోచుకోలేదు. ప్రభుత్వాలు మారుతున్నా రహదారి దుస్థితి మారడం లేదు. సరికదా కనీసం ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సొంత ఊరిలో ఎంతో మంది నేతలు ఉండగా అభివృద్ధికి నోచుకోకపోవడం దురదృష్టకరమని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను మభ్యపెట్టి ఓట్లు వేసుకోవడమే తప్పితే, అధికారం చేపట్టిన తరువాత ప్రజలకు న్యాయం చేయాలనే ఆలోచన ప్రజాప్రతినిధులకు లేకపోవడం శోచనీయమని వారు మండిపడుతున్నారు.

కూటమిలోనైనా అభివృద్ధి జరిగేనా...

వైసీపీ ప్రభుత్వ హయాంలో కుంచంగి గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా అభివృద్ధికి నోచుకుంటుందా అని పలువురు గ్రామస్థులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కుంచంగి గ్రామంలో శిథిలావస్థకు చేరిన ప్రధాన రోడ్డును తక్షణమే బాగుచేసి అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు. ముందుగా రోడ్డుకిరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య సమస్య తొలగించాలని, తరువాత రోడ్డును నిర్మించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

పలు గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి

కుంచంగి ప్రధాన రోడ్డు మార్గంలో కూండ్రం, రొంగలివానిపాలెం, వెంకుపాలెం తదితర గ్రామాలకు రాకపోకలు జరుగుతున్నాయి. చాలా మంది ఇదే మార్గంలో



మురుగు నీటితో దారుణంగా తయారైన కుంచంగి ప్రధాన రోడ్డు

ప్రయాణం చేస్తుంటారు. రోడ్డు అధ్వానంగా ఉన్నప్పటికీ ఇదే మార్గంలో ప్రయాణించే క్రమంలో ప్రమాదాలు సంభవించిన దాఖలాలు లేకపోలేదు. తీర్థాల సమయంలో బయట ఊళ్ల నుంచి వచ్చే వారిలో 12 మంది ప్రమాదాల బారిన పడ్డారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే రోడ్డు, కాలువలు నిర్మించాలని వారు కోరుతున్నారు.

మా గ్రామానికి కాలువలు నిర్మించాలి



-చిన్నికృష్ణ, రైతు, కుంచంగి గ్రామం, అనకాపల్లి మండలం

మా గ్రామంలో గత 30 ఏళ్లగా ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదు. డ్రైనేజీలు, కాలువలు లేక గ్రామంలో ఉన్న నివాసులంతా రోడ్డుపైనే మురుగునీరు విడిచిపెడుతున్నారు. దీంతో రోడ్డంతా మురుగునీటితో నిండిపోయి కంపు కొడుతోంది. ఫలితంగా రాత్రి సమయంలో దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కాలువలు నిర్మించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలి.

ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలి



-చిన్ని రమణారావు, కుంచంగి గ్రామ

గ్రామంలో ప్రధాన రోడ్డు సరిగా లేక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాం. అనకాపల్లి వెళ్లి రావాలంటే భయమేస్తుంది. అడుగడుగునా పెద్ద గొయ్యిలతో రోడ్డంతా దర్శనమిస్తున్నది. రహదారికి వచ్చే మార్గంలో కొన్ని చోట్ల మాత్రమే విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల లైట్లు ఉన్నా మురుగునీటి గొయ్యి ఉందో... నుయ్యి ఉందో తెలియని పరిస్థితిలో రోడ్డు ఉంది. తక్షణమే రోడ్లు నిర్మించి గ్రామాలకు అందుబాటులోకి తీసుకురావాలి.

ఇంటర్వ్యూ..

ఆక్రమణల నిరోధానికి పటిష్ట చర్యలు

-బి.చిన్నికృష్ణ, తహసీల్దార్, సబ్బవరం



మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణల నిరోధానికి, గ్రావెల్/మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి, భూ తగాదాల పరిష్కారానికి పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వ భూములను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. ఆక్రమణలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: మండలంలో భూ తగాదాల పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: గ్రీవెన్స్ ప్రకారం క్షేత్ర స్థాయి పర్యటన చేసి ఇరు వర్గాలను సమన్వయ పరిచి పరిష్కరిస్తున్నాం. మా పరిధిలో లేనివి ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నాం.

ప్ర: ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

జ: ఎస్ఎఫ్ఏ ప్రకారం ప్రభుత్వ భూములను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. వాటి పరిరక్షణ బాధ్యతను వీఆర్ఏ, వీఆర్వోలకు అప్పగించాం. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తున్నాం.

ప్ర: మండలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు అడ్డుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: గ్రావెల్/మట్టి తవ్వకాలకు సంబంధించి మైనింగ్, పోలీసు అధికారుల సహకారంతో అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తున్నాం. ఇటీవల పలు చోట్ల దాడులు చేసి వాహనాలు సీజ్ చేయడం జరిగింది. తవ్వకాలకు సంబంధించిన సమాచారం ఇస్తే స్పందిస్తాం. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

ప్ర: ప్రజా పరిష్కార వేదికకు వస్తున్న గ్రీవెన్స్ పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: రెగ్యులర్‌గా ప్రజా పరిష్కార వేదికకు వచ్చే గ్రీవెన్స్‌కు సంబంధించి రికార్డులను పరిశీలించి అర్జీదారులతో మాట్లాడి సాధ్యమైనంత తొందరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. సమస్య పరిష్కారం కాకపోతే ఏ విధంగా పరిష్కారమవుతుందో వారికి వివరిస్తున్నాం.

-సబ్బవరం, ఆంధ్రజ్యోతి

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

▸▸ ఎంపీపీ బోకం సూర్యకుమారి



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న సమస్యలను ప్రధాన వైద్యులు డాక్టర్ చక్రవర్తి అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కోసం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే సిబ్బంది నియామకం గురించి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, కమిటీ సభ్యులు కొటాన రాము, సబ్బవరపు నారాయణమూర్తి, బోకం రామునాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పకడ్బందీగా పూర్తిచేయండి

▸▸ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న

సబ్బవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత భూముల రీ సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న సూచించారు. మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన రీ సర్వేను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి ఫిర్యాదులు లేకుండా, రైతుల సమక్షంలో అత్యంత జాగరూకతతో సర్వే నిర్వహించాలని సూచించారు. మడుల హద్దుల నిర్ధారణ ప్రక్రియను నాలుగు పక్కల రైతులు సమక్షంలో నిర్వహించాలని, విస్తీర్ణాల్లో తేడాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. రైతులు లేకుండా సర్వే చేయవద్దని చెప్పారు. ఈ సందర్భంగా మ్యాప్‌లు పరిశీలించారు. సర్వే అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. భూ రికార్డులు, హక్కు పత్రాలు, పాస్ పుస్తకాలు అధికారులకు విధిగా అందజేయాలన్నారు. రెండు ఫొటోలు, ఆధార్ కార్డు జెరాక్సు, ఫోన్ నంబర్‌ను సర్వే అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, రీ సర్వే డీటీ గణపతిరావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, సర్పంచ్ బండారు మంగ, మాజీ ఎంపీపీ గండి దేముడు, నాయకులు బండారు శ్రీను, బోను నాయుడు, వీఆర్వో అప్పలరాజు, విలేజ్ సర్వేయర్లు మౌనిష, బి.ఇందిర, రైతులు పాల్గొన్నారు.



గుల్లేపల్లిలో రీ సర్వే తీరును పరిశీలిస్తున్న డీఐవోఎస్ వెంకన్న

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సత్కారం



ద్వారపురెడ్డి పరమేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

కొత్తూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన ద్వారపురెడ్డి పరమేశ్వరరావును మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎమ్మార్పీఎస్‌కు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. జిల్లాలో ఎటువంటి కార్యక్రమాలైనా ఎమ్మార్పీఎస్ తరఫున పాల్గొని బీజేపీకి బలోపేతంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యలకా మల్లిబాబు, ఎంఎస్‌పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టుమూరి మంగరాజు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్న అప్పారావు, జిల్లా కార్యదర్శి కాకినాడ కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు రూ.50 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించాలి

▸▸ సీపీఎం నాయకులు లోకనాథం, కోటేశ్వరరావు



పోస్టర్ ఆవిష్కరించిన సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.50 వేల కోట్ల ప్యాకేజీని ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఫిబ్రవరి ఒకటి నుంచి మూడో తేదీ వరకు నెల్లూరులో జరగబోయే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ మహాసభల్లో ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధి చర్చించనున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీల్లో ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులు కేటాయించలేదన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు ప్రారంభించకపోవడం వల్ల ఎనిమిదిన్నర లక్షల ఎకరాల భూములకు సాగునీరు లేకుండా పోయిందన్నారు. ఉత్తరాంధ్రలో సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని ఆరోపించారు. ప్రభుత్వరంగ పరిశ్రమ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం గనులు ఇవ్వడం లేదన్నారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరిస్తామని ఎన్నికల ముందు చెప్పారని, నేటి వరకు పనులు ప్రారంభం కాలేదని వాపోయారు. నేటికి మత్స్యకారులకు వేట నిషేధిత భృతి చెల్లించలేదన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా సమగ్రాభివృద్ధికి, భవిష్యత్తు పోరాటాలకు రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు డి.వెంకన్న, గంటా శ్రీరామ్, ఎం.అప్పలరాజు, ఆర్.శంకరరావు, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నరేంద్రసింగ్ బేడీ సేవలు మరువలేనివి

తుమ్మపాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ కూలీల పక్షంగా పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి నరేంద్రసింగ్ బేడీ అని సామాజిక ఉద్యమకర్త వీఎస్ అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన ప్రముఖ సంఘ సంస్కర్త నరేంద్రసింగ్ బేడీ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి పథకాన్ని రూపకల్పన చేసి గ్రామీణ ప్రాంతాల వారికి పనులు కల్పించిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన మరణం వ్యవసాయ కూలీ వర్గానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రాజాన దొరబాబు, ఆమ్ ఆద్మీపార్టీ నేత కొణతాల హరినాథబాబు, ఏఐటీయూసీ నేత కోన లక్ష్మణ, రైతు సంఘం నాయకుడు కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో సెయింట్‌జాన్స్ విద్యార్థుల ప్రతిభ



ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో బోధకులు

కశింకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సైన్స్ అండ్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో సెయింట్‌జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రూపనంది తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న డి.రిత్విక్ ఆర్యవర్ధన్, ఆరో తరగతి విద్యార్థి కె.టెర్రీ టైసన్, తొమ్మిదో తరగతి విద్యార్థులు కె.అభిరామ్, కె.ఆదిత్య శ్రీపతి, టి.దేవి లిప్సిక, పి.నీరజన్ ప్రతిభ కనబరిచారన్నారు. వీరంతా ఫిబ్రవరి 9న జరగనున్న రెండో లెవెల్ పరీక్షకు ఎంపికైనట్టు ఆమె చెప్పారు. విద్యార్థులను అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి అభినందించారు.

సీడీఎంఏ డైరెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే పీలా



తుమ్మపాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సీడీఎంఏ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ సంపత్ కుమార్‌ను మంగళవారం అమరావతి సచివాలయంలో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు.పలు అంశాలపై ఆయనతో చర్చించారు.

రహదారిపై కూలిన భారీ వృక్షం

▸▸ సీఐ చొరవతో సత్వర తొలగింపు చర్యలు



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన భారీ వృక్షం

కశింకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డులో మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో రోడ్డు మధ్యలో ఉండడంతో జాతీయ రహదారి నుంచి నర్సీపట్నం వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ సమస్య ఎదురైంది. దీంతో సీఐ అల్లు స్వామినాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సరి చేశారు. సుమారు గంట వ్యవధిలో రోడ్డుపై ఉన్న చెట్టును తొలగించే మార్గం సుగుమం చేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు.

నిరుపేదలకు అన్నదానం

అనకాపల్లి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దిబ్బవీధి నాగేంద్రస్వామి ఆలయం వద్ద మంగళవారం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం జరిగింది. గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శ్రీనివాసరావు, దేవి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ఈ సందర్భంగా దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ రోషన్‌కుమార్, సభ్యులు మద్దాల క్రాంతికుమార్, శరగడం శివాజీ పాల్గొన్నారు.

నేవల్ డాక్‌యార్డు వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడిగా దాసుబాబు



సబ్బవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నేవల్ డాక్‌యార్డు వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడిగా ఎం.దాసుబాబును ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. మంగళవారం జరిగిన ఈ ఎన్నికలో ఉపాధ్యక్షులుగా జి.అచ్యుతరావు, కె.ప్రసాదు, ప్రధాన కార్యదర్శిగా కె.రవి, సహాయ ప్రధాన కార్యదర్శిగా ఆర్‌వీ.రమణ, కోశాధికారిగా జి.దేముడు, సహాయ కోసాధికారిగా ఎస్.హరీశ్‌ను ఎన్నికున్నారు. అసోసియేషన్ సంక్షేమానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దాసుబాబు పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్

తుమ్మపాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తుమ్మపాల మెయిన్ రోడ్డులో అతి వేగంతో దూసుకువచ్చిన టిప్పర్ అనకాపల్లి వైపు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో ఛిద్రమైంది. అయితే ప్రయాణికులకు ఎలాంటి అపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన జరిగిన వెంటనే స్థానికులంతా కలిసి టిప్పర్‌ని నిలుపుదల చేసి వాగ్వాదానికి దిగారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. మెయిన్ రోడ్డులో క్వారీ లారీల ఆగడాలకు అడ్డు లేకపోతుందని, అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడాలని వారు కోరారు.

డీఎంహెచ్‌వో రవికుమార్‌కు సన్మానం



డీఎంహెచ్‌వో రవికుమార్‌ను సత్కరించిన వైద్య సిబ్బంది

అనకాపల్లి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యాలయంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి.రవికుమార్‌ను సత్కరించారు. అంతకు ముందు ఎల్‌డీ కంప్యూటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎస్.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా కేవీ.పద్మావతి, కార్యదర్శిగా జేవీ శేఖర్, కోశాధికారిగా పి.జనార్ధన్ నియమితులయ్యారు. ఈ కార్యవర్గ ప్రతినిధులు డీఎంహెచ్‌వో రవికుమార్‌ను సత్కరించారు. అనంతరం జిల్లా కమిటీ నియామకంపై డీఎంహెచ్‌వోకు వివరించామని లక్ష్మీనారాయణ తెలిపారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు

▸▸ ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ



సమావేశానికి హాజరైన ఆటో డ్రైవర్లు...
(ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మోటార్ వాహన చట్టం నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ హెచ్చరించారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ఆటో డ్రైవర్లతో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆయన సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, ముఖ్యంగా కెపాసిటికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే మూల్యం చెల్లించుకోవాల్సి తప్పదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని సూచించారు. ఆటో ముందు సీటులో ఎవరినీ ప్రయాణించడానికి అవకాశం లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే రూ.10 వేలు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రూ.వెయ్యి జరిమానా చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. అలాగే అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికాకూడదని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ఆటో రికార్డులు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు యూనిఫారం ధరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

'విశాఖ పాల డెయిరీ యాజమాన్యం అవినీతిపై విచారణ చేపట్టాలి'

తుమ్మపాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ పాల డెయిరీ యాజమాన్యం అవినీతి, అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాల ధరను రూ.4కు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డెయిరీ చట్టంలో ఉన్న లొసుగులను వినియోగించుకుని మాక్స్ చట్టం కిందకు తర్వాత కంపెనీ చట్టం కిందకు విశాఖ డెయిరీ యాజమాన్యం మార్చిందన్నారు. దీంతో ప్రభుత్వ పర్యవేక్షణ లేక అక్రమాలకు అవకాశం కలిగిందన్నారు. తక్షణమే డెయిరీలో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.అప్పలరాజు, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు ఏకరవు

పరిష్కారానికి కార్పొరేటర్, అధికారులు హామీ

అనకాపల్లిలో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం

- డ్రైనేజీలు, వీధి లైట్లు, తాగునీరు, దోమల బెడద, వీధికుక్కల సమస్యలను ప్రస్తావించిన స్థానికులు

(అనకాపల్లి - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అనకాపల్లి జోన్ పరిధిలోని 84వ వార్డు కోట్ని వీధి రామాలయం కల్యాణ మండపంలో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' నినాదంతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానికులు ఆయా సమస్యలపై గళమెత్తారు. కోట్ని వీధిలో ప్రధానంగా డ్రైనేజీ కాలువలు బాగు చేయించాలని, నిత్యం కాలువలను శుభ్రం చేయించాలని, రక్షిత మంచినీటి ట్యాంకుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేశారు. లక్ష్మీనారాయణనగర్‌లో పార్కును బాగుచేసి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు. వీటిపై వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లితోపాటు ఆయా శాఖ అధికారులు, సిబ్బంది స్పందించారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. చర్చావేదికలో పాల్గొన్న స్థానికుల్లో ఎవరేమన్నారంటే...

● మరిడిమాంబ గుడి ప్రాంతంలో డ్రైనేజీ కాలువలు సరిగా లేవు. పలుచోట్ల దెబ్బతినడంతో మురుగునీరు పారడంలేదు. దోమలు బెడద మరింత ఎక్కువైపోయింది. మురుగునీరు నిలబడకుండా వుండేలా కాలువలను బాగు చేయించాలి. -గంటం రెడ్డి వెంకటరత్నం, మరిడిమాంబ గుడి ఏరియా

కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. నిధులు లభ్యం కాగానే పనులు ప్రారంభించడానికి ప్రయత్నిస్తాం.

-గోపాలకృష్ణ, జీవీఎంసీ జోన్-7, డీఈఈ

● లక్ష్మీనారాయణనగర్‌లో స్కేటింగ్ పార్కులో కూర్చునే సిమెంటు బల్లలు పాడయ్యాయి. వీటిని వెంటనే ఏర్పాటు చేయాలి. ఈ ప్రాంతంలో చాలా కాలంనాటి నిద్రగన్నేరు చెట్లు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ఈ చెట్టు కొమ్మలను తొలగించే ఏర్పాటు చేయాలి.-సానా వెంకట్రావు, లక్ష్మీనారాయణనగర్

పార్కులో బెంచీలను కొత్తవి ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. అతి త్వరలోనే ఆ సమస్యను పరిష్కారం చేస్తాం. నిద్రగన్నేరు చెట్టు కొమ్మలను తొలగింపజేస్తాం.

-మాదంశెట్టి చినతల్లి, 84వ వార్డు కార్పొరేటర్

● మా ప్రాంతంలో వీధిలైట్లు సరిగా వెలడంలేదు. రోడ్లు పాడైపోయాయి. సాయంత్రం అయితే చాలు ఆకతాయిలు గంజాయి సేవిస్తూ స్థానికులకు బెడదగా తయారయ్యారు. పలుమార్లు పోలీసులకు సమాచారం కూడా ఇచ్చాం.. స్పందించలేదు.

-షేక్ శంషుద్దీన్, శ్రీరాం టవర్స్, లక్ష్మీనారాయణనగర్

ఆకతాయిల కదలికలపై ఎప్పటికప్పుడు నైట్ బీట్ పోలీసుల పర్యవేక్షణ ఉంటుంది. పట్టణంలో మొత్తం మూడు టీములు పహారా కాస్తున్నాయి. ఎక్కడైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తుంటే వెంటనే నాకు గానీ, పోలీసు హెల్ప్‌లైనుకు గానీ ఫోన్ చేయండి. తక్షణమే ఆ ప్రాంతానికి చేరుకుని



డ్రైనేజీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువస్తున్న కోట్ని యశోద



సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ డీఈఈ గోపాలకృష్ణ. వేదికపై కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, టీడీపీ నేత నీలబాబు, సీఐ విజయ్‌కుమార్

ఆకతాయిలను అదుపులోకి తీసుకుంటాం. ఇటీవల వేర్వేరుచోట్ల మొత్తం 13 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకొని హెచ్చరించాం.

-పట్టణ సీఐ విజయ్‌కుమార్

● రైల్వే స్టేషన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సు సర్వీసు నడపాలి. కాలువల్లో పూడికలు ఎప్పటికప్పుడు తీయించి పారిశుధ్యం మెరుగుపరచాలి. రహదారుల పక్కన ఆక్రమణలను తొలగించాలి.

-కోట్ని రామకృష్ణ, టీడీపీ పట్టణ కార్యదర్శి

కాలువల్లో పూడిక తీత పనులు నిరంతరం చేపడతాం. ఆక్రమణలను తొలగించి రోడ్డును విశాలం చేయడానికి కృషి చేస్తున్నాం.-డీఈఈ గోపాలకృష్ణ

● మురుగు కాలువల్లో నీరు సరిగా పారకపోవడంతో దుర్గంధంతోపాటు దోమల బెడద తీవ్రంగా ఉంది. దోమల నియంత్రణకు తరచూ ఫాగింగ్ చేయించాలి. -కోట్ని యశోద, కోట్నివీధి



ఈ రోజు సాయంత్రం నుంచి ఆయా ప్రాంతాల్లో ఫాగింగ్ చేయిస్తాం. కాలువల్లో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లిస్తాం.-రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

● ఊరకుక్కల బెడద రోజు రోజుకూ అధికమవుతున్నది. వీధి లైట్లు సరిగా వెలగకపోవడం వల్ల రాత్రిపూట పలువురు కుక్కల దాడికి గురవుతున్నారు. కుక్కల బెడదను నియంత్రించాలి.

-తల్లి పైడమ్మ, స్థానికురాలు

మీ ప్రాంతంలో ఇప్పటికే కొన్ని కుక్కలను పట్టుకుని వేరే ప్రాంతానికి తరలించాం. మిగిలిన



వీధి లైట్లు వెలగని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువస్తున్న షేక్ శంషుద్దీన్

కుక్కలను కూడా పట్టుకుని వీటి బెడదను నివారించడానికి మరింత కృషి చేస్తాం.

-డీఈఈ గోపాలకృష్ణ

● సరిసావారి వీధిలో 40 ఏళ్ల కిందట నిర్మించిన రోడ్డు బాగా దెబ్బతిన్నది. పెద్ద పంట కాలువ దగ్గర నుంచి కొత్తగా రోడ్డు వేయాలి. ఈగల సమస్య కూడా తీవ్రంగా ఉంది. -సరిసా అర్జునరావు, కోట్నివీధి

సరిసావీధిలో రోడ్డు నిర్మించేందుకు గతంలో నిధులు మంజూరయ్యాయి. వీధిలో ప్రజలంతా ఒకే మాటపై ఉంటే పనులు ఇప్పటికే పూర్తయ్యేవి. ఆక్రమణల నుంచి స్వచ్ఛందంగా వైదొలిగితే రోడ్డు నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాం.

-డీఈఈ గోపాలకృష్ణ

● మురుగు కాలువలను తొమ్మిది రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నారు. తీవ్ర జాప్యం వల్ల కాలువల్లో చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నది. -కోట్ని సత్యలక్ష్మి, కోట్నివీధి

పట్టణంలోని డ్రైనేజీ కాలువలను రోజు విడిచి రోజు శుభ్రం చేయిస్తున్నాం. రోజూ శుభ్రం చేయించేందుకు తగినంత మంది కార్మికులు లేరు. రోడ్డు, పరిసరాలను రోజూ శుభ్రం చేయిస్తున్నాం. -రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

● కోట్నివీధి పెద్ద కాలువలో వ్యర్థాలను రోజూ తొలగించడం లేదు. దీంతో మురుగునీరు నిలిచిపోయి దుర్గంధంతోపాటు దోమలు బెడద పెరిగింది. దీనివల్ల రోగాలు ప్రబలుతున్నాయి.

-పరమేశ్వరరావు, కోట్నివీధి

పెద్ద కాలువలో వ్యర్థాలను తరచూ తొలగించేలా చర్యలు చేపడుతున్నాం. మీ ప్రాంతంలో కూడా ఎప్పటికప్పుడు తొలగించేందుకు కృషి చేస్తాం. -రవి కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

● రైల్వే స్టేషన్ నుంచి పట్టణంలోకి సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య నివారణకు రింగురోడ్డు నుంచి రైల్వే స్టేషన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సులు నడపాలి. గతంలో ఈ రూట్‌లో బస్సులను కొంత కాలం నడిపి తరువాత నిలిపివేశారు. -కోట్ని రాంబాబు, కోట్నివీధి

బస్సు సర్వీసులపై గతంలో సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగింది. కూటమి నేతలతో మాట్లాడి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తాం. -మాదంశెట్టి చినతల్లి, కార్పొరేటర్



మాట్లాడుతున్న కార్పొరేటర్ చినతల్లి, సీఐ విజయ్‌కుమార్, మెప్మా ఏపీడీ సంతోష్‌కుమార్



సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తున్న సరిసా అర్జునరావు, కోట్ని రామకృష్ణ, ఎస్.వెంకటరావు, జి.వెంకటరత్నం, హైమావతి, జ్యోతి

సమస్యల పరిష్కారమే అజెండా...

... 3వ పేజీ తరువాయి

రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచిస్తున్నామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ, దోమల నివారణకు ఫాగింగ్ చేస్తామని, డ్రైనేజీల్లో పూడిక, చెత్త తొలగిస్తామని చెప్పారు.

స్థానికులు సానా వెంకటరావు, శంషుద్దీన్ తదితరులు మాట్లాడుతూ తమ వీధిలోని పార్కులో బెంచీలు విరిగిపోయాయని, వీధిలైట్లు లేకపోవడంతో ఆకతాయిల బెడద ఎక్కువైందని ఆందోళన వ్యక్తంచేశారు. రాత్రి సమయంలో పార్కు పరిసరాల్లో మద్యం సేవిస్తున్నారని, మందుబాబుల కారణంగా మహిళలు, యువతులు, విద్యార్థినులు భయపడుతున్నారని అన్నారు. ఇందుకు పట్టణ సీఐ విజయకుమార్ స్పందిస్తూ.. పార్కు పరిసరాల్లో గస్తీని ముమ్మరం చేస్తామని, పార్కు పరిసరాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

ముఖ్యమైన రైళ్ల రాకపోకల సమయంలో రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు బస్సులు నడపాలని కోట్నివీధికి చెందిన టీడీపీ పట్టణ కార్యదర్శి కోట్ని రామకృష్ణ కోరారు. కోట్నివీధికి చెందిన నాగమణి మాట్లాడుతూ కోట్నివీధి, నెయ్యిలవీధి, గొల్లవీధిలలో మంచినీటి సరఫరా చాలినంతగా లేదని, నీటి సరఫరా మెరుగుపరచాలని కోరగా.. వాటర్‌వర్క్స్ ఏఈ హరీశ్ స్పందిస్తూ వీధిలో పాడైన నీటిట్యాంకును వినియోగంలోనికి తీసుకువచ్చి దానికి నీటిని మళ్లిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలు ఇచ్చినా ఇంత వరకు స్థలం చూపలేదని కొంతమంది మహిళలు చెప్పగా.. మెప్మా ఏపీడీ సంతోశ్‌కుమార్ బదులిస్తూ.. కార్యాలయానికి వస్తే లబ్ధిదారుల వివరాల మేరకు స్టేటస్ చెబుతానన్నారు. చివరగా కార్పొరేటర్ చినతల్లి మాట్లాడుతూ, 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా కోట్ని వీధి, లక్ష్మీనారాయణనగర్ ప్రజలు తమ సమస్యలను తనతోపాటు అధికారుల దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. ప్రతి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'ఆంధ్రజ్యోతి' అనకాపల్లి ప్రతినిధి ఎం.వెంకట పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోట్నివీధి, లక్ష్మీనారాయణనగర్‌కు చెందిన కోట్ని రాంబాబు, హరి, సూరిజగన్నాథరావు, మజ్జి శ్రీను, కింతాడ బాబు, కోట్ని నాగమణి, సేనాపతి గణేశ్, దుడ్డు నాగేశ్వరరావు, కర్రి అవినాశ్, గుర్రాల శ్రీనివాస్, జీవీఎంసీ అనకాపల్లి జోన్ సిబ్బంది, ఆంధ్రజ్యోతి ప్రతినిధులు పాల్గొన్నారు. తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి కార్యక్రమం ఏర్పాటుచేసిన 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యానికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

మామిడి, జీడిమామిడి తోటలకు మంచు దెబ్బ

- పూత మాడిపోతుందేమోనని రైతులు ఆందోళన
- తెగుళ్లు విజృంభించే అవకాశం





కిరణ్మాయి, ఉద్యాన శాఖ అధికారి

సబ్బవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గత వారంలో రోజుల నుంచి దట్టంగా పొగ మంచు కురుస్తుండడంతో మామిడి, జీడిమామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చెట్లన్నీ పూతతో నిండివున్నాయి. ఇటువంటి తరుణంలో మంచు విపరీతంగా పడుతుండడంతో పూత రాలిపోయే ప్రమాదం వుందని, తెగుళ్ల సైతం విజృంభిస్తాయని అంటున్నారు. మండలంలో వంగలి, టెక్కలిపాలెం, బంగారమ్మపాలెం, ఎ.సిరసపల్లి, ఆరిపాక, నారపాడు, నల్లరేగులుపాలెం, బాటజంగాలపాలెం, గాలిభీమవరం, తవ్వవానిపాలెం, ఎల్లుప్పి, బోదివలస, అయ్యన్నపాలెం, అమృతపురం గ్రామాల్లో 1011.92 ఎకరాల్లో మామిడి, 868.92 ఎకరాల్లో జీడిమామిడి తోటలు వున్నాయి. సాధారణంగా డిసెంబరు మొదటి వారం నుంచి మామిడి తోటలు పూతకు వస్తుంటాయి. కానీ గత ఏడాది నవంబరుతోపాటు డిసెంబరు మొదటి వారంలో కూడా వర్షాలు పడడంతో పూత రావడం ఆలస్యమైంది. ఈ నెల ఆరంభం నుంచి తోటలు పూత పూస్తున్నాయి. కాగా వారం రోజుల నుంచి దట్టంగా పొగమంచు కురుస్తుండడంతో పూత మాడిపోతుందని, తెగుళ్ల ఆశిస్తాయని మామిడి, జీడిమామిడి తోటల సాగుదారులు వాపోతున్నారు.

మామిడి, జీడిమామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు

కొద్ది రోజుల నుంచి దట్టంగా కురుస్తున్న పొగమంచు కారణంగా మామిడి, జీడిమామిడి తోటలకు నష్టం వాటిల్లే అవకాశం వుందని, అందువల్ల రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి కిరణ్మాయి చెప్పారు. మామిడిలో తేనె మంచు, తామర, కాయతొలచు పురుగులు, ఆకుమచ్చ, బూడిద తెగుళ్ల ఆశిస్తాయని, జీడిమామిడి తోటలను టీ దోమ, ఎర్రనల్లి, కాండం తొలుచు పురుగు, పూత మాడు తెగులు ఆశిస్తాయని చెప్పారు. వీటిని నియంత్రించడానికి పురుగు మందులతోపాటు పోషకాలు కూడా అందించాలని చెప్పారు.

లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, ఐదు గ్రాముల యూరియా కలిపి కొమ్మలన్నీ తడిచేలా పిచికారీ చేయాలన్నారు. బోరాన్ లోపం ఉన్నట్టయితే లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున బోరాన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. జీడిమామిడి తోటల్లో టీ దోమ నివారణకు లాంబ్డాసైలోత్రిన్ మందును లీటరు నీటికి రెండు ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. పూతమాడు తెగులు నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము ఎసిఫేట్ లేదా కార్బండిజమ్ కలిపి చెట్టు మొత్తం తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు.

గోవాడలో క్రషింగ్‌కు అంతరాయం

- ఫ్యాక్టరీ యాజమాన్యం తీరుపై రైతుల ఆగ్రహం



ఫ్యాక్టరీ యార్డులో నిలిచిపోయిన చెరకు బళ్లు

చోడవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ బాయిలర్‌లో మంగళవారం ఉదయం తలెత్తిన సాంకేతికలోపంతో క్రషింగ్ నిలిచిపోయింది. రెండు రోజుల క్రితం బగాస్ (చెరకు పిప్పి) కొరత ఏర్పడడంతో సుమారు 24 గంటలపాటు నిలిచిపోయిన క్రషింగ్ తిరిగి సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. మళ్లీ మంగళవారం తెల్లవారుజామున మరోసారి క్రషింగ్ నిలిచిపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెరకు బళ్లతో యార్డు నిండిపోవడంతోపాటు, క్రషింగ్ ఆగిపోవడంతో రైతులు అసహనానికి గురయ్యారు. మంగళవారం సాయంత్రం ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు ఇంటి వద్దకు వెళ్లి క్రషింగ్ ఆగిపోవడంపై ప్రశ్నించారు. బాయిలర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నామని, క్రషింగ్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని ఆయన నచ్చజెప్పారు.

ఏకే 47 మిస్ ఫైర్!

- స్పెషల్ పార్టీ ఆర్‌ఎస్‌ఐ కాలికి గాయం
- సీలేరు పోలీస్ స్టేషన్‌లో ఆయుధాన్ని శుభ్రం చేసే క్రమంలో ఘటన
- మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలింపు
- సంఘటనను గోప్యంగా ఉంచిన పోలీసులు

సీలేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్‌లో ఏకే 47 మిస్ ఫైర్ అయి స్పెషల్ పార్టీ ఆర్‌ఎస్‌ఐ కాలికి గాయమైంది. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం సీలేరు పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ పార్టీకి కేటాయించిన గది వద్ద ఆర్‌ఎస్‌ఐ కె.హరీశ్ ఏకే 47లోని మ్యాగ్జిన్‌ను బయటకు తీసి శుభ్రం చేస్తుండగా మిస్‌ఫైర్ అయి అతని కుడి కాలి పాదానికి గాయమైంది. వెంటనే అతనిని సీలేరు, చింతపల్లి పీహెచ్‌సీలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఏకే 47 మ్యాగ్జిన్ తొలగించే క్రమంలో ఒక రౌండ్ అందులో ఉండిపోవడంతో మిస్‌ఫైర్ అయినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విషయం బయటకు పొక్కకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మాడుగుల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతనపూడి అగ్రహారం గ్రామానికి చెందిన తర్రా శ్రీను(32) ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి బైక్‌పై మంగళవారం మధ్యాహ్నం పోతనపూడి గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఓ వాహనం ఎదురుగా వచ్చి బలంగా ఢీకొంది. దీంతో శ్రీనుకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

అడ్డగోలుగా గ్రావెల్, మట్టి దందా

... 3వ పేజీ తరువాయి

కొంత మంది అధికారులు పెడచెవిన పెడుతున్నారు. ఇదిలావుండగా పైడివాడ అగ్రహారంలో వీఎంఆర్‌డీఏ లే-అవుట్లో పట్టపగలు గ్రావెల్ తవ్వకాలు జరుపుండగా.. ఆర్ఐ వీరయ్య దాడి చేసి రెండు లారీలు, ఒక ఎక్సకవేటర్‌ను సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం పోలీసులకు అప్పగించారు. మండలంలోని పలు గ్రామాల్లో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ బి.చిన్నికృష్ణను వివరణ కోరగా, గ్రావెల్, మట్టి తవ్వకాలు జరగకుండా నిఘా పెట్టామని, వీఆర్వోలు, వీఆర్ఏలను అప్రమత్తం చేశామని చెప్పారు. ఎక్కడైనా గ్రావెల్ నిల్వ చేసి వుంటే అక్కడకు వెళ్లి సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు పోలీసు, మైనింగ్, రెవెన్యూతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

35 వేల కిలోల గంజాయి దహనం

... 3వ పేజీ తరువాయి

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా.. పట్టుకున్న గంజాయి, నిందితులు, కేసుల గురించి డీజీపీకి వివరించారు. 2023, 2024 సంవత్సరాల్లో 1,304 మందిని అరెస్టు చేసి 35 వేల కిలోలకుపైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ గంజాయి శాస్త్రీయ పద్ధతిలో ఆరు రోజుల్లో దహనం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఐజీ ఆకే రవికృష్ణ, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, పరవాడ, అనకాపల్లి డీఎస్పీలు విష్ణు స్వరూప్, మల్లంపాటి శ్రావణి, ఆర్డీవో షేక్ ఆయీషా, తహసీల్దార్ అంబేద్కర్, పలువురు సీఐలు పాల్గొన్నారు.

అడ్డదారి గురువులపై సస్పెన్షన్ వేటు!

... 3వ పేజీ తరువాయి

చేయించి, ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారు. దీనిపై 'గురువులు అడ్డదారి' శీర్షికన ఈ నెల 7న 'ఆంధ్రజ్యోతి'లో కథనం కూడా వెలువడింది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు.. డిప్యూటీ డీఈవోతో విచారణ జరిపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమే కాకుండా ప్రభుత్వాన్ని మోసం చేసినట్టు విచారణలో తేలింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు కె.సంధ్య, జి.సూర్యప్రకాశ్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509